**విలేకరులు కావలెను**
కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి..సెల్ నెం:9700370499
సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు

# విజయ సారథి
RNI / APTEL/2015/64956
తెలుగు దినపత్రిక

**టీవీ రిపోర్టర్లు కావలెను**
A.P VISION TV
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు వెంటనే సం॥ సెల్ నెం:9700370499
యండి. పి.వెంకటేశ్వర్లు

చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | మంగళవారం 15-07-2025 | సంపుటి : 11 | సంచిక : 165 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


## మామిడికాయల లారీ బోల్తా

### తొమ్మిది మంది దుర్మరణం
### గటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి



అన్నమయ్య జిల్లా,జూలై14: అన్నమయ్య జిల్లాలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ బోల్తా పడి తొమ్మిది మంది మృతిచెందారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లాలోని రెడ్డిపల్లె చెరువుకట్టపై చోటుచేసుకుంది. రాజంపేట నుంచి రైల్వేకోడూరు మార్కెట్‌కు మామిడికాయల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి చెరవుకట్టపై బోల్తా పడింది. లారీ బోల్తా పడటంతో 10 మంది కూలీలకు తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఆస్పత్రిలో వైద్యులు వారి పరిస్థితిని సమీక్షించి చికిత్స అందిస్తున్నారు. తొమ్మిదిమంది మృతుల్లో ఐదుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. మృతులు సబ్బరత్న(45), చిట్టె-(25), గజ్జల లక్ష్మీదేవి (36), రాధ (39), వెంకట సుబ్బ(37) గజ్జల రమ(42), మణిచం(38), గజ్జల దర్గ(32), గజ్జల శీను(33) గుర్తించారు. మృతులు రైల్వేకోడూరు మండలం సెట్టిగుంట వాసులుగా గుర్తించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతం మొత్తం విషాదకరంగా మారింది. సమాచారం అందగానే ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. ఈ విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అన్నమయ్య జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అన్నమయ్య జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పుల్లంపేట మండలం రెడ్డి చెరువు కట్టపై మామిడి లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడి 9 మంది మృత్యువాత పడటంపై విచారం వ్యక్తం చేశారు.

## గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు నియామకం



అమరావతి, జులై 14: గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్‌గజపతిరాజు నియమితులయ్యారు. మూడు రాష్ట్రాలకు గవర్నర్‌లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు (సోమవారం) ఉత్తర్వులు జారీ చేశారు. హర్యానా గవర్నర్‌గా ఆషింకుమార్ ఘోష్ (ంబష్ట్రతిని ఐబీఎజీతీ ఉష్ట్రనీబష్ట్ర), గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవిందర్ గుప్తాలను (ఐజీలతినిటవతీ ఉబీజూబిజీ) రాష్ట్రపతి నియమించారు. విజయనగరానికి చెందిన అశోక్ గజపతి రాజు ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో యాక్టివ్ మెంబర్‌గా ఉన్నారు. గతంలో ఆయన కేంద్రమంత్రిగా పనిచేశారు. తాజాగా ఆయనను గోవా గవర్నర్‌గా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఇక హర్యానా గవర్నర్‌గా ప్రస్తుతం బండారు దత్తాత్రేయ కొనసాగుతూ వచ్చారు. తాజాగా ఆయన స్థానంలో కొత్త గవర్నర్‌గా ఆషింకుమార్ ఘోష్‌ను నియమించారు. ఆషింకుమార్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.కాగా.. రాష్ట్రానికి ప్రథమ పౌరుడిగా భావించే గవర్నర్ పదవిని చేపట్టిన వారిలో తెలుగువారు చాలా మందే ఉన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర వంటి పెద్ద రాష్ట్రాల రాజ్‌భవన్‌లో తెలుగు వారు గవర్నర్లుగా ఆశీనులయ్యారు. అందులో తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులుగా చేసిన ప్రముఖులు కూడా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఇప్పటి వరకూ మొత్తం 20 మంది వివిధ రాష్ట్రాలకు గవర్నర్లుగా పనిచేశారు. అలాగే ఒడిశా, తమిళనాడులోని తెలుగు కుటుంబాల్లో జన్మించిన ఇద్దరితో పాటు తెలుగింటి కోడలుగా వచ్చిన ఒకరు కూడా గవర్నర్లుగా పనిచేశారు. అంతేకాకుండా వీరిలో పలువురు ఏకకాలంలో వివిధ రాష్ట్రాల్లో గవర్నర్లుగా ఉన్నారు.

గవర్నర్లుగా తెలుగు వారు వీరే..

1. భోగరాజు పట్టాభి సీతారామయ్య - మధ్యప్రదేశ్ మొదటి గవర్నర్ (1956-57) -(పశ్చిమ గోదావరి జిల్లా వాసి)
2. బూర్గుల రామకృష్ణారావు - కేరళ గవర్నర్ 1956-60, 1960-62 (ఉత్తర్‌ప్రదేశ్) (మహబూబ్‌నగర్ జిల్లా వాసి)
3. వి.వి.గిరి - ఉత్తర్‌ప్రదేశ్ (1957-60), కేరళ (1960-65), కర్ణాటక (1965-67) (బెర్హంపూర్, ఒడిశా) గవర్నర్
4. బెజవాడ గోపాలరెడ్డి - ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ (1967-72) (నెల్లూరు జిల్లా వాసి)
5. మర్రి చెన్నారెడ్డి - ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ (1974-77), పంజాబ్ గవర్నర్ (1982-83), రాజస్థాన్ గవర్నర్ (1992-93), తమిళనాడు గవర్నర్ (1993-96) (రంగారెడ్డి జిల్లా వాసి)
6. కోన ప్రభాకర్‌రావు - పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ (1983-84), సిక్కిం గవర్నర్ (1984-85), మహారాష్ట్ర గవర్నర్ (1985-86) (గుంటూరు జిల్లా వాసి)
7. పెండేకంటి వెంకట సుబ్బయ్య - బిహార్ గవర్నర్ (1985-88), కర్ణాటక గవర్నర్ (1987-1990) (కర్నూలు జిల్లా వాసి)
8. జనరల్ కె.వి.కృష్ణారావు - మణిపూర్, నాగాలాండ్ (1984-1989), జమ్మూకశ్మీర్ 1989-90, 1993-99 (విజయనగరం జిల్లా వాసి)
9. కాసు బ్రహ్మానందరెడ్డి - మహారాష్ట్ర (1988-90) (గుంటూరు జిల్లా వాసి)
10. బి.సత్యనారాయణ రెడ్డి - ఉత్తర్‌ప్రదేశ్ (1990-93), ఒడిశా (1993-95) (మహబూబ్‌నగర్ జిల్లా వాసి)
11. కె.వి.రఘునాథరెడ్డి - త్రిపుర గవర్నర్ (1990-93), పశ్చిమ బెంగాల్ గవర్నర్ (1993-98) (నెల్లూరు జిల్లా వాసి)
12. పి.శివశంకర్ - సిక్కిం (1994-95), కేరళ గవర్నర్ (1995-96)

## న్యూఢిల్లీలో తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ !



అమరావతి, జులై 14: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం న్యూఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. మంగళవారం ఉదయం సీఎం చంద్రబాబు నాయుడు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12.00 గంటలకు ఆయన న్యూఢిల్లీకి చేరుకుంటారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి అమిత్ షా, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవి, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేర్వేరుగా సమావేశం కానున్నారు.అలాగే నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వికే సారస్వత్, ఢిల్లీ మెట్రో ఎండీతో సైతం సీఎం చంద్రబాబు భేటీ అవనున్నారు. ఇక ప్రధాని సంగ్రహాలయలో మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నర్సింహారావు జీవితంపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రసంగించనున్నారు. అలాగే భారత పరిశ్రమ సమాఖ్య- సీఐఐ స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు పాల్గొనున్నారు.

**న్యూఢిల్లీలో సీఎం చంద్రబాబు షెడ్యూల్ ఇలా..** జులై 15వ తేదీ మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల మధ్య కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో ఆయన నివాసంలో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు.మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం చంద్రబాబుతో ఆయన అధికారిక నివాసంలో నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ సమావేశం కానున్నారు.మధ్యాహ్నం 3.00 గంటలకు సీఎం చంద్రబాబును ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ఢిల్లీ మెట్రో ఎండీ కలవనున్నారు.సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ప్రధాని సంగ్రహాలయను సీఎం చంద్రబాబు సందర్శించనున్నారు. అనంతరం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సంస్మరణ సభలో 'పీవీ జీవితం, వారసత్వం'పై ఆయన కీలక ప్రసంగం చేయనున్నారు.సాయంత్రం 7.00 గంటలకు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు.బుధవరం అంటే.. జులై 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం భేటీ కానున్నారు. అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆయన సమావేశం కానున్నారు.రాత్రి 7 గంటలకు సీఐఐ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం - బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా పలు అంశాలపై కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించనున్నారు.స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారంపై టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

## గవర్నర్ పదవికి అశోక్ గజపతిరాజు వన్నె తేవాలి: సీఎం, లోకేష్



అమరావతి, జులై 14: గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజును నియమించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన గౌరవం అని అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని నరేంద్ర మోదీకి , కేంద్ర మంత్రివర్గానికి కృతజ&జతలు తెలియజేశారు. అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా ఆ పదవికి వన్నె తేవాలి అని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆకాంక్షించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా అశోక్ గజపతిరాజుకు సీఎం, మంత్రి విషెస్ తెలియజేశారు.చంద్రబాబు ట్వీట్ 'గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్ గజపతిరాజుకు అభినందనలు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు దక్కిన గౌరవం. ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కృతజ్ఞతలు. గవర్నర్‌గా తన విధుల నిర్వహణలో అశోక్ గజపతి రాజు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

లోకేష్ విషెస్ గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజును నియమించడం పట్ల మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానికి కృతజ&జతలు తెలియజేశారు. అశోక్ గజపతిరాజుకు ఉన్న నీతి, నిజాయితీ, నిబద్ధత, అంకితభావం, ప్రజల కోసం పరితపించే గుణం గవర్నర్ పదవికి మరింత గౌరవం తెచ్చిపెడతాయని లోకేష్ ట్వీట్ చేశారు.అలాగే అశోక్ గజపతిరాజుకు ఏపీ బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు కూడా అశోక్ గజపతిరాజుకు ఫోన్ చేసి అభినందించారు. పార్టీ పట్ల అంకితభావం, ప్రజాసేవలో నిబద్ధత ఉన్న నేతకు గౌరవం దక్కిందని యనమల రామకృష్ణుడు ప్రశంసించారు.

## నిరాశా నిస్పృహాల్లో జగన్, వైకాపానేతలు

### అందుకే కారుకూతలు కూస్తున్నారు: దేవినేని

విజయవాడ,జూలై14: జగన్, వైసీపీ నేతలు తీవ్ర ఫస్ట్రేషన్‌లో ఉన్నారని.. అందువల్లనే రాష్ట్రంలో గందరగోళం సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమ మహేశ్వరరావు మండిపడ్డారు. ఈ మేరకు జగన్ మోహన్ రెడ్డిపై దేవినేని ఉమ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌మోన్ రెడ్డి, వైసీపీ నేతలకు ఏం పోయే కాలం వచ్చిందని దుయ్యబట్టారు. పల్నాడు, బంగారుపాళ్యం, గుడివాడ వంటి ఘటనలు జగన్ కుతంత్రాల్లో భాగమే అని ఆరోపించారు. అహంకారం, మదం, ఒళ్ళు బలుపుతో చంద్రబాబు నాయుడు వయస్సుపై, స్పీకర్ అయ్యన్న, కొల్లు రవీంద్రలపై పిచ్చికూతలు కూస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నేతలకు ప్రజల్లోకి వెళ్లే దమ్ము ధైర్యం లేక పార్టీ మీటింగ్‌లు, ప్రెస్‌మీట్‌లు పెట్టి పిచ్చికూతలు కూస్తున్నారన్నారు. ఇటు-వంటి మాటలు మాట్లాడి జైల్లో పెడితే సానుభూతి పొందవచ్చు అని అనుకుంటు-న్నారన్నారు. ఇటు-వంటి వ్యాఖ్యలపై సంబంధిత శాఖల పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో తీర్పు రిజర్వ్ చేసిన కోర్టు

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, తదితరులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రాసిక్యూషన్ కంప్లయింట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. జూలై 29న దీనిపై తీర్పు వెలువరించనుంది.మనీ లాండరింగ్‌కు ఇదొక 'క్లాసికల్ ఎగ్జాంపుల్' అంటూ ఈడీ ఇంతకుముందు పేర్కొంది. కాంగ్రెస్ అగ్రనేతలు రూ.2,000 కోట్ల మేరకు నేరపూరిత కుట్ర, ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించింది. యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ వివాదానికి కీలకంగా ఉంది. ఇందులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి సంయుక్తంగా 76 శాతం వాటా ఉంది. నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రికను ప్రచురించే అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఆస్తులను అక్రమంగా యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వాడుకుందని ఈడీ ప్రధాన ఆరోపణగా ఉంది.ఈడీ ఫిర్యాదులో



సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ దివంగత నేతలు మోతీలాల్ ఓరా, ఆస్కార్ ఫెర్నాండెజ్‌తోపాటు శ్యామ్ పిట్రోడా, సుమన్ దూబే, యంగ్ ఇండియా కంపెనీ తదితరుల పేర్లు ఉన్నాయి. రూ.90 కోట్ల రుణం పేరుతో రూ.2,000 కోట్ల విలువచేసే ఏజేఎల్ ఆస్తులను యంగ్ ఇండియాకు మళ్లించుకున్నారని ఈడీ చెబుతోంది. ఈడీ ఛార్జిషీటులో సునీల్ భండారి, డోటెక్స్ మర్చండైజ్ ప్రైవేటు లిమిటెడ్ పేర్లు కూడా ఉన్నాయి.

## తిరుపతి రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదం.. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో చెలరేగిన మంటలు

తిరుపతి, జులై 14: తిరుపతి రైల్వేస్టేషన్‌లోని యార్డ్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. యార్డ్‌లో ఆగి ఉన్న రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు.. హిసార్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ల బోగీలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో రైల్వేస్టేషన్ అధికారులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక శకటాలతో వారు అక్కడికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. రాజస్థాన్‌లోని హిసార్ నుంచి హిసార్ ఎక్స్‌ప్రెస్ సోమవారం ఉదయం 11.50కి తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుంది.ప్రయాణికులను రైల్వేస్టేషన్‌లో దింపిన తర్వాత యార్డ్‌లోకి వెళు తున్న క్రమంలో ఇంజిన్ వెనుక భాగంలో ఉన్న రైల్వే బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అదే సమయంలో పక్క ట్రాక్‌పై ఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జనరేటర్ బోగీలోకి మంటలు వ్యాపించాయి. ఫైర్ ఇంజన్ వచ్చి.. మంటలు ఆర్పేలోగా హిసార్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీ పూర్తిగా కాలిపోయింది. ఇక రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లోని జనరేటర్ బోగీ పాక్షికంగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. రైల్వేస్టేషన్ సమీపంలో అగ్నిప్రమాదం జరగడంతో.. ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. మరోవైపు ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అగ్నిప్రమాదం సంభవించగానే.. ఇంజిన్ నుంచి బోగీలను వేరు చేశారు.

## సంపాదకీయం

మంగళవారం 15-07-2025

# బిగ్ గేమ్ షురూ..

బిహార్.. ఉత్తర భారత దేశంలో అతిపెద్ద రాష్ట్రాల్లో ఇదీ ఒకటి. ఇక్కడ బీజేపీ, జేడీయూ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉంది. నితీశ్‌కుమార్ వరుసగా 15 ఏళ్లు సీఎంగా ఉన్నారు. ఈ ఏడాది చివరలో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈసారి బిహార్‌లో ఎన్డీఏ అదికారంలో రాకుండా చేయడమే లక్ష్యంగా విపక్ష కాంగ్రెస్, ఆర్జేడీ, జన్ సురాజ్ పార్టీ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో మహారాష్ట్రలో హిందీ వ్యతిరేక నిరసనలు, ఏడీఆర్ ఎన్నికల సంస్కరణల వ్యతిరేకత, నార్వే రాయబారితో కిశోర్ సమావేశం రాజకీయ కుట్రల చర్చను రేకెత్తిస్తున్నాయి.కాంగ్రెస్, ఆర్జేడీలతో కూడిన ఇండియా కూటమి బిహారీ గుర్తింపు, సామాజిక న్యాయ ఎజెండాతో ముస్లిం, యాదవ, ఓబీసీ, ఈబీసీ ఓట్లను లక్ష్యంగా చేసుకుంది. ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీ అగ్రకులాల ఓట్లను చీల్చడంతోపాటు యువత, నిరుపేదలను ఆకర్షిస్తోంది. కిశోర్ జేడీయూ 25 సీట్లు దాటదని, నితీశ్ కుమార్ మళ్లీ సీఎం కాబోడని సవాల్ విసిరారు. ఇండియా కూటమి సామాజిక న్యాయ ఎజెండాతో బలమైన ఓటు బ్యాంకును ఏర్పరచగలదు. ఈ క్రమంలోనే కీలక పరిణామాలు జరుగుతున్నాయిమహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే (శివసేన యూబీటీ), రాజ్ ఠాక్రే (ఎంఎన్ఎస్) హిందీని మూడో భాషగా పరిచయం చేసే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించి, 20 ఏళ్ల తర్వాత కలిశారు. ఈ నిరసనలు మహాయుతి (బీజేపీ?శివసేన) ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, హిందీ విధానాన్ని రద్దు చేయించాయి. బిహారీలపై దాడులు ఈ నిరసనలతో ముడిపడి ఉన్నాయనే అనుమానం ఉంది. ఈ నిరసనలు బీజేపీకి రాజకీయ నష్టం కలిగించి, బిహార్ ఎన్నికల్లో బిహారీ గుర్తింపును లేవనెత్తే ఇండియా కూటమి వ్యూహానికి సహకరిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.ప్రశాంత్ కిశోర్‌తో నార్వే రాయబారి సమావేశం కొత్త చర్చకు దారితీసింది. నార్వే గతంలో లిబియా, ఇథియోపియా, శ్రీలంకలో ప్రభుత్వాల మార్పుకు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొన్న చరిత్ర ఉంది. ఈ సమావేశం ఎన్డీఏను ఓడించే కుట్రలో భాగమనే ఊహాగానాలు ఉన్నాయిఅసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) బిహార్‌లో ఓటరు జాబితా సవరణను వ్యతిరేకిస్తోంది, దీనిని ఎన్డీఏ ఆమోదించింది. గతంలో ఎన్నికల బాండ్ల రద్దు, రఫేల్ వివాదంలో బీజేపీని లక్ష్యంగా చేసుకున్న ఏడీఆర్, ఇండియా కూటమికి మద్దతుగా పనిచేస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఏడీఆర్ వ్యతిరేకత ఓటరు జాబితా సవరణను దళిత, ఓబీసీ, మైనారిటీ ఓటర్లకు వ్యతిరేకమైన చర్యగా చిత్రీకరిస్తోంది. ఇది ఇండియా కూటమికి రాజకీయంగా లాభిస్తుంది.ఎన్డీఏలో బీజేపీ 74 సీట్లతో బలంగా ఉన్నప్పటికీ, జేడీయూ 43 సీట్లతో బలహీనంగా ఉంది. చిరాగ్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీ 243 సీట్లలో పోటీ చేస్తామని ప్రకటించి, ఎన్డీఏ ఓట్లను చీల్చే అవకాశం ఉంది. బిహార్‌లో ఎన్డీఏను ఓడించేందుకు కాంగ్రెస్, ఆర్జేడీ, జన్ సురాజ్ వ్యూహాత్మక కదలికలు సాగిస్తున్నాయి. మహారాష్ట్రలో హిందీ వ్యతిరేక నిరసనలు, ఏడీఆర్ ఎన్నికల సంస్కరణల వ్యతిరేకత, నార్వే రాయబారి సమావేశం రాజకీయ కుట్రల చర్చను రేకెత్తిస్తున్నాయి. ఎన్డీఏలో అంతర్గత కలహాలు, చిరాగ్ పాశ్వాన్ స్వతంత్ర వైఖరి ఇండియా కూటమికి అవకాశం కల్పిస్తున్నాయి. అయితే, విదేశీ జోక్యం ఆరోపణలకు ఆధారాలు అవసరం.. బీహార్ ఓటర్ల జాబితాలో అనేక మంది బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ దేశస్తులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఈసీ వర్గాలు తెలిపినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. మీడియా కథనాల ప్రకారం.. బంగ్లా, నేపాల్, మయన్మార్ దేశాలకు చెందిన అనేక మంది ప్రస్తుతం రాష్ట్రంలో నివాసముంటున్నారని సర్వేలో తేలింది.వారంతా ఆధార్ కార్డులు, నివాస ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు లాంటి వాటిని అక్రమ మార్గాల ద్వారా పొందినట్లు సమాచారం. సర్వే చేస్తున్న క్షేత్రస్థాయి అధికారులు ఇలాంటి వారిని అనేక మందిని గుర్తించినట్లు తెలుస్తోంది. అక్రమ ఓటర్ల పేర్లను ఆగస్టు 1 నుంచి 30 వరకు గుర్తించి జాబితా నుంచి తొలగించనున్నట్లు ఈసీ వర్గాలు తెలిపాయి. అనర్హులు, నకిలీ ఓటర్లతోపాటు విదేశీయులను ఓటర్ల జాబితా నుంచి తొలగించేదమే లక్ష్యంగా ఈ సర్వే ప్రారంభించినట్లు ఈసీ చెబుతోంది.కాగా ఇలాంటి సర్వేను చివరిసారిగా 20 ఏళ్ల క్రితం చేశారు. అప్పటి నుంచి అనుబంధ సవరణలు మాత్రమే చేపడుతున్నారు. కాగా అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలలు ముందు ఈసీ ఈ ప్రక్రియను చేపట్టడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఓటర్ల జాబితా సవరణపై అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్ అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. రాజ్యాంగంబద్ధమైన ప్రక్రియగా పేర్కొంది. అయితే, ఈసీ ఎంచుకున్న టైమ్ పీరియడ్‌ను మాత్రం కోర్టు ప్రశ్నించింది. బిహార్ ఎన్నికలు రసవత్తరంగా మారినప్పటికీ, ఫలితాలే ఈ రాజకీయ ఆటలో విజేతను నిర్ణయిస్తాయి.

# రైళ్లలో సీసీటీవీలు

ముంబై, జూలై 14, భారతీయ రైల్వే ప్రయాణికుల భద్రతను పెంపొందించే దిశగా ఒక అద్భుతమైన, సమగ్రమైన ప్రణాళికను ఆవిష్కరించింది. దేశవ్యాప్తంగా మొత్తం 74,000 ప్యాసింజర్ కోచ్‌లు, 15,000 సరుకు రవాణా లోకోమోటివ్‌లలో అత్యాధునిక సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ తాజాగా ప్రకటించింది. అయితే రైలు 100 కిలో మీటర్ల వేగంతో వెళ్తున్నా దృశ్యాలు అత్యంత నాణ్యంగా వచ్చేలా ఇవి పని చేయబోతున్నట్లు పేర్కొంది. ఈ బృహత్తర ప్రాజెక్ట్ ప్రయాణ అనుభవాన్ని మెరుగు పరచడమే కాకుండా రైళ్లలో జరిగే నేరాలకు అడ్డుకట్ట వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.ఈ సీసీటీవీల ఏర్పాటుకు ప్రధాన లక్ష్యం



ప్రయాణికుల భద్రతను గణనీయంగా పెంచడం. రైళ్లలో జరిగే వస్తువుల దొంగతనాలను నియంత్రించడం. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవడం. తద్వారా నేరాలను నివారించడం వంటి కీలక ఉద్దేశాలతో ఈ కెమెరాలను అమర్చుతున్నారు. రైల్వే అధికారులు ఈ చర్యల ద్వారా ప్రయాణికులు మరింత సురక్షితంగా, నిశ్చింతగా ప్రయాణించగలరని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ప్రతి ప్యాసింజర్ బోగీలో ప్రయాణికుల గోప్యతకు భంగం కలగకుండా, వారి కదలికలు ఎక్కువగా ఉండే ద్వారాల వద్ద మొత్తం 4 డోమ్ సీసీటీవీ కెమెరాలను అమర్చుతారు. అంటే ప్రతి ప్రవేశ మార్గం వద్ద రెండు కెమెరాలు ఉంటాయి. అదేవిధంగా ప్రతి లోకోమోటివ్‌లో 6 సీసీటీవీ కెమెరాలను వ్యూహాత్మకంగా ఏర్పాటు చేస్తారు. లోకోమోటివ్ ముందు, వెనుక భాగాలలో ఒక్కో కెమెరా, కార్‌కు రెండు వైపులా డోమ్ టైప్ కెమెరాలతో పాటు, డ్రైవర్ క్యాబిన్‌లో డ్రైవర్ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి రెండు డెస్క్ మౌంటెడ్ మైక్రోఫోన్ కెమెరాలు కూడా ఉంటాయి. ఈ సీసీటీవీ కెమెరాలన్నీ అత్యాధునిక సాంకేతికతతో, సర్టిఫికేషన్‌తో వస్తాయి. ఇది వాటి నాణ్యతకు హామీ. రైలు గంటకు 100 కిలో మీటర్ల కంటే ఎక్కువ వేగంతో ప్రయాణిస్తున్నా లేదా తక్కువ కాంతి పరిస్థితుల్లో కూడా స్పష్టమైన చిత్రాలను, వీడియోలను రికార్డు చేయగల సామర్థ్యం వీటికి ఉంది.ఈ భారీ ప్రాజెక్టును అమలు చేయడానికి ముందు ఉత్తర రైల్వే విభాగంలో ఎంపిక చేసిన ప్యాసింజర్ బోగీలు, లోకోమోటివ్‌లలో ప్రయోగాత్మకంగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి విజయవంతంగా పరీక్షించారు. సానుకూల ఫలితాల అనంతరం రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ విస్తృత ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు. భవిష్యత్తులో సీసీటీవీ డేటాను విశ్లేషించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ాంకేతికతను వినియోగించుకోవాలని కూడా రైల్వే మంత్రి సూచించారు. ఇండియా ఏఐ మిషన్ సహకారంతో ఈ కెమెరాల డేటాను విశ్లేషించి, అసాధారణ పరిస్థితులను గుర్తించి, భద్రతా చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ చర్యలన్నీ భారతీయ రైల్వేలను భద్రతలో ఒక అడుగు ముందుకు వేయిస్తాయని ఆశిస్తున్నారు.

# జీతం చాలగం లేదు

## కంగనా హాట్ కామెంట్స్

ముంబై జూలై 14, రాజకీయాలు అంటేనే మన దేశంలో అదో మురికి కూపం అంటారు అందరు. ఇక నేటితరం యువత నిరుద్యోగం కారణంగా నేతల వెంట తిరుగుతూ టైంపాస్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేది మాత్రం సంపన్నులే. ప్రజల్లో ఇమేజ్ ఉన్నా పాకెట్‌లో మనీ లేకపోతే ఓట్లు రాలవు. ఇక ప్రజాప్రతినిధిగా ఎన్నికైతే చాలా మంది ప్రజాసేవను వదిలేసి సంపాదనే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కానీ, ఎంపీ కంగనా రనౌత్ మాత్రం ప్రజాప్రతినిధి జీతం దేనికి చాలదంటున్నారు. ఇంకో ఉద్యోగం చేస్తే కానీ బతుకుబండి సాగదని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ నాయకుల ఆర్థిక సవాళ్లను, నిజాయితీతో రాజకీయాలు చేయడం వల్ల ఎదురయ్యే ఆటంకాలను ఎత్తి చూపుతున్నాయి.కంగనా రనౌత్ తన ఎంపీ జీతం 50?60 వేల రూపాయలు ఉంటుందని, అయితే నియోజకవర్గంలో పర్యటనలు, పీఏలు, పార్టీ నేతల సమావేశాలు, ఇతర ఖర్చులు లక్షల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఖర్చులను భరించడానికి ఎంపీ జీతం సరిపోదని, అందుకే అదనపు ఉద్యోగం లేదా వ్యాపారం అవసరమని స్పష్టం చేశారు. నిజాయితీతో రాజకీయాలు చేయాలనుకునే వారికి ఇది మరింత సవాలుగా ఉంటుందని అన్నారు. ఈ వ్యాఖ్యలు నాయకులు తమ నియోజకవర్గ బాధ్యతలను నిర్వహించడానికి ఎదుర్కొనే ఆర్థిక ఒత్తిడిని సూచిస్తుంది.



ఆర్థిక నిజాయితీ, పారదర్శకతపై ప్రశ్నలను లేవనెత్తుతుంది. చాలా మంది ఎంపీలు వ్యాపారవేత్తలు, న్యాయవాదులు లేదా ఇతర వృత్తుల్లో ఉంటూ ఆర్థిక స్థిరత్వాన్ని పొందుతున్నారని ఆమె సూచించారు. ఈ సందర్భంలో, రాజకీయాలను పూర్తి సమయం వృత్తిగా చేయడం సామాన్య ఎంపీలకు సవాలుతో కూడుకున్న విషయంగా కనిపిస్తుంది. ఈ వాదన రాజకీయ వ్యవస్థలో ఆర్థిక సమస్యలు, వాటి పరిష్కారంపై చర్చకు దారితీస్తుంది.నియోజకవర్గంలో పర్యటనలు, సమావేశాల నిర్వహణ, సిబ్బంది నిర్వహణ, ప్రచార కార్యక్రమాలు వంటివి భారీ ఖర్చులకు దారితీస్తాయి. ఈ ఖర్చులు ఎంపీల జీతంతో సమతూకంలో ఉండవు. అందుకే అదనపు ఆదాయ వనరులు అవసరమని కంగనా వాదన. ఈ సందర్భంలో, రాజకీయ వ్యవస్థలో ఖర్చుల నిర్వహణ, పారదర్శకత, ఎంపీలకు అందించే ఆర్థిక సౌకర్యాలపై పునరాలోచన అవసరమని కంగనా వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. రాజకీయాల్లో నిజాయితీతో ఉండే వారు ఎదుర్కొనే సవాళ్లను వెల్లడిస్తున్నాయి. నిజాయితీగా రాజకీయాలు చేయాలనుకునే వారికి ఆర్థిక ఒత్తిడి ప్రధాన అడ్డంకిగా ఉంటుంది. ఈ సమస్య రాజకీయ వ్యవస్థలో సంస్కరణల అవసరాన్ని సూచిస్తుంది.

# సీతారామా క్రెడిట్ ఎవరికి...,

ఖమ్మం, జూలై 14, గోదావరి జలాలు చెంతన పారుతున్నప్పటికీ వినియోగించుకోలేని దుస్థితి ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులది. ఈ జిల్లాలో మెజారిటీ సాగు భూములు ఇప్పటికీ నాగార్జున సాగర్ కిందనే ఉన్నాయి. నాగార్జునసాగర్ గనుక నిండితే ఆయకట్టు రైతులు వరి సాగు చేస్తారు. లేకపోతే పొలాలను బీళ్లుగా పెడతారు. వాస్తవానికి సాగర్లో నీళ్లు ఉండగానే సరిపోదు.. అవి సక్రమంగా వస్తేనే పొలాలు పారుతాయి.. లేకపోతే మధ్యలోనే ఎండిపోతాయి.. ఈ పరిస్థితి గమనించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పరిపాలకులు దుమ్ముగూడెం టెల్ ఫాండ్ ను తెరపైకి తీసుకొచ్చారు. దీని ప్రకారం అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం వద్ద దీనిని నిర్మించాలని భావించారు. కాలక్రమంలో ఆ ప్రాజెక్టు నిర్మాణానికి నోచుకోలేదు. చివరికి తెలంగాణ ఏర్పాటు కావడంతో.. భారత రాష్ట్ర సమితి అధికారంలోకి రావడంతో తెరపైకి సీతారామ ఎత్తిపోతల పథకం వచ్చింది.అనేక మార్పులు చేర్పుల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కట్టాలి అనుకున్న కుమ్మరిగూడెం వద్ద సీతారామ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. దీనిని అనేక ప్యాకేజీలుగా వర్గీకరించారు. ఈ ప్యాకేజీలవారీగా పనులు సాగుతున్నాయి. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నిర్మించి తలపెట్టిన ఈ పథకం.. కొంతమేర పూర్తయింది. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ పథకం నిర్మాణం ఊపందుకుంది. సరిగ్గా గత ఏడాది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు.. ఇప్పుడు మోటార్ ప్రారంభించి పొలాలకు నీటిని అందించడం మొదలుపెట్టారు.వాస్తవానికి ఈ పథకం నిర్మాణంలో మొదట క్రెడిట్ ఇవ్వాల్సింది కాంగ్రెస్ ప్రభుత్వానికి. అనివార్యంగా కృష్ణ జలాలు రాకపోతే గోదావరి జలాలతో ఉమ్మడి జిల్లా రైతుల పంట పొలాలకు సరఫరా చేయాలని నాటి ప్రభుత్వ పెద్దలు భావించారు. ఇందులో భాగంగానే దుమ్ముగూడెం టైల్ ఫాండ్ స్కీం తెరపైకి తెచ్చారు. రాజకీయ కారణాల వల్ల ఆ పథకం కాస్త సీతారామ ఎత్తిపోతల పథకంగా మారిపోయింది. నాడు దుమ్ముగూడెం, ఇందిరా సాగర్ కోసం తీసుకొచ్చిన మోటార్లను భక్త రామదాసు ఎత్తిపోతల పథకానికి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం వాడింది. ఆ తర్వాత సీతారామ ఎత్తిపోతల పథకాన్ని ప్యాకేజీలుగా గులాబీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విభజించింది. అనంతరం ఈ పథకానికి సంబంధించిన పనుల విషయంలో సమస్యలు ఏర్పడ్డాయి. ఆ సమస్యలు మొత్తం ఒక కొలిక్కి రావడానికి చాలా సమయం పట్టింది. అనంతరం పనులు మొదలయ్యాయి. ఇక మొదట్లో అనుకున్న దానికంటే ఎక్కువ ప్రాంతానికి గోదావరి జలాలు ఇవ్వాలని భావించారు. ప్రస్తుతం గోదావరి జిల్లాలో తెలంగాణ సరిహద్దున ఉన్న అశ్వరావుపేట దాకా వెళ్తున్నాయి. ఇక్కడ కాల్వల నిర్మాణం కూడా పూర్తయింది . ఈ ప్రాంతంలో రైతులు కేవలం బోర్లు, వ్యవసాయ భావుల ద్వారానే పంట పొలాలు సాగు చేస్తున్నారు. కానీ ఇప్పుడు గోదావరి జలాలు రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా కొన్ని పనులు పూర్తయితే మిగతా ప్రాంతాలకు కూడా సాగునీరు అందుతుంది.ఈ పథకానికి మొదట కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పించింది. ఆ తర్వాత భారత రాష్ట్ర సమితి ఎత్తిపోతల పథకం గా మార్చింది. చివరికి కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని పూర్తి చేసి రైతుల పొలాలకు నీరు అందించడం మొదలుపెట్టింది. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా నీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో ఈ గొప్పతనం మొత్తం తమకే దక్కుతుందని భారత రాష్ట్ర సమితి.. అసలు దీనికి మూలమే తాము అని.. విద్యుత్ ఖర్చు లేకుండా నీరు అందించాలని తాము అనుకుంటే.. విపరీతమైన ఖర్చుతో ఎత్తిపోతల పథకానికి సంకల్పించారని.. పనులు మధ్యలో నిలిపివేస్తే.. తదుపరి పనులు తాము పూర్తి చేసి నీరు సరఫరా చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నాయకులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికి తమ పొలాలకు సాగునీరు రావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కరువుకాలంలో పంటలు ముమ్మరంగా సాగు చేయడానికి ఆస్కారం ఉంటుందని సంబరపడుతున్నారు.

# పవన్ వర్సెస్ ప్రకాష్ రాజ్



బెంగళూరు, జూలై 14, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ లేటెస్ట్ కామెంట్స్ సోషల్ మీడియాలో ప్రకంపనలు రేపుతున్నాయి. హిందీని రాజభాష అన్న పవన్ కళ్యాణ్.. దాన్ని ఆదరిస్తే తప్పేంటని అన్నారు. పవన్ కళ్యాణ్ కామెంట్స్ పై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొందరు సమర్థిస్తుండగా మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. నటుడు ప్రకాష్ రాజ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పవన్ కళ్యాణ్ కి ఘాటైన కౌంటర్ ఇచ్చారు.గచ్చిబౌలి స్టేడియం వేదికగా 'రాజభాష విభాగం స్వర్ణోత్సవ సమ్మేళం' జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఆయన తన ప్రసంగంలో తెలుగు భాష తల్లి అయితే? హిందీ పెద్దమ్మ వంటిది. మాతృభాష ఇంట్లో కుటుంబ సభ్యులతో మాట్లాడుకోవడానికే, బయటకు వెళితే హిందీ భాష కావాలి అన్నారు. తెలుగు చిత్రాలు హిందీలో ఆదరించబడుతున్నాయి. అలాంటప్పుడు హిందీని మనం ఆదరిస్తే తప్పేంటి.. అని చెప్పుకొచ్చారు. తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలు హిందీని నిర్బంధం చేయడాన్ని వ్యతిరేకిస్తున్న క్రమంలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చర్చకు తెరలేపాయి.పవన్ కళ్యాణ్ హిందీ భాషను సమర్థిస్తూ చేసిన కామెంట్స్ పై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. బీజేపీ పార్టీకి పూర్తి అనుకూలంగా మారిన పవన్ కళ్యాణ్.. వారిచ్చిన స్క్రిప్ట్ ఫాలో అవుతున్నారని, గతంలో ఈయనే గో బ్యాక్ హిందీ అనే నినాదం చేశాడంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. అదే సమయంలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను తప్పుబట్టాల్సిన అవసరం లేదు. హిందీ నేర్చుకోవడం వలన వచ్చిన నష్టం ఏమీ లేదు. నార్త్ ఇండియాలో సౌత్ విద్యార్థులు, ఉద్యోగులు హిందీ రాక పడే బాధలు తెలిస్తే ఇలా మాట్లాడరు.. అంటూ పవన్ కళ్యాణ్ కి కొందరు మద్దతు ప్రకటిస్తున్నారు.కాగా పవన్ కళ్యాణ్ కామెంట్స్ పై నటుడు ప్రకాష్ రాజ్ స్పందించారు. ట్విట్టర్ ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ పై ఘాటైన విమర్శలు చేశాడు. పవన్ కళ్యాణ్ కామెంట్స్ కి సంబంధించిన వీడియో షేర్ చేసిన ప్రకాష్ రాజ్? 'మరీ ఈ రేంజ్ కి అమ్ముకోవడమా.. ఛీ ఛీ' అని కామెంట్ పోస్ట్ చేశాడు. బీజేపీ పార్టీకి పవన్ కళ్యాణ్ తొత్తుగా మారాడనే అర్థంలో ప్రకాష్ రాజ్ అసహనం వ్యక్తం చేశారు. ప్రకాష్ రాజ్ ట్వీట్ వైరల్ గా మారిందిగతంలో కూడా పలుమార్లు పవన్ కళ్యాణ్ రాజకీయ నిర్ణయాలను ప్రకాష్ రాజ్ వ్యతిరేకించారు. బీజేపీ విధానాలతో పూర్తిగా విభేదించే ప్రకాష్ రాజ్.. ఆ పార్టీతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేస్తూ ఉంటారు. ఒక శాతం ఓటు బ్యాంకు లేని బీజేపీతో పవన్ కళ్యాణ్ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం ఏముందని గతంలో ప్రకాష్ రాజ్ విమర్శలు గుప్పించారు. ఇక తిరుమల లడ్డు వివాదంలో సైతం పవన్ కళ్యాణ్-ప్రకాష్ రాజ్ మధ్య మాటల యుద్ధం నడిచింది.

# ప్రభుత్వ కార్యాలయాలకు సత్రాలే దిక్కా...

మెదక్, జూలై 14, నిత్యం రద్దీగా ఉండే కొమురవెల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు ఆలయసత్రాలే దిక్కయ్యాయి. సిద్దిపేట జిల్లా కేంద్రానికి చేరువలో ఉండటం, రాజీవ్ రహదారిని అనుకోని రెవెన్యూ గ్రామాలు ఉండడం ఈ మండలానికి భలే డిమాండ్ ఉంటుంది. కానీ రెవెన్యూ కార్యాలయానికి భవనం నిర్మించేందుకు ప్రభుత్వ స్థలం లేదంటూ అధికారులు సాకు చెప్పడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి.కొమురవెల్లి మండలంగా ఏర్పడి 10 సంవత్సరాలు గడిచినప్పటికీ పోలీస్ స్టేషన్ కు మాత్రమే స్థలం కేటాయించి భవన నిర్మాణం జరిగింది. మండల పరిషత్ కార్యాలయం ఆలయసత్రం భవనంలోనే కొనసాగుతుండగా ప్రవేటు అద్దె భవనంలో తహసిల్దార్ కార్యాలయం కొనసాగుతుంది. తహసిల్దార్ భవనం ఖాళీ చేయాలంటూ ఓనరు ఇటీవలే ఆదేశించినట్లు తెలిసింది. అయితే మరెఎక్కడ కార్యాలయానికి సరిపడే భవనాలు లేకపోవడంతో ఆ భవనాన్ని అధికారులు ఖాళీ చేయలేకపోతున్నారు.ఇదివరకు పోలీస్ స్టేషన్ కొనసాగిన ఆలయ భవనంలోకి తహసిల్దార్ కార్యాలయాన్ని మార్చేందుకు ఆలయ అధికారులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. మండల విద్యాధికారి కార్యాలయం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో కొనసాగుతుండగా, వ్యవసాయ శాఖ కార్యాలయం రైతు వేదికలో కాలమెల్లదిస్తుంది. ఐకెపి భవనానికి గ్రామైక్య సంఘం భవనం సరిపడింది. నిత్యం ప్రజలకు అవసరమైన మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, కార్యాలయాల ఊసే లేదు. తహసిల్దార్ కార్యాలయం కొనసాగుతున్న భవనానికి సుమారు రూ.10 లక్షలు అద్దె బకాయి ఉండటం ఖాళీ చేయడానికి ప్రధాన కారణమని స్థానికులు తెలిపారు. ఆధ్యాత్మిక రంగంలో అత్యంత పేరుగాంచిన కొమురవెల్లి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి లేదంటూ అధికారులు చెప్పటం పట్ల పలువురు విమర్శలు చేస్తున్నారు. సామూహిక ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం సుమారు 2 ఎకరాల భూమి అవసరం ఉంటుందని అందుకు సంబంధించిన భూసేకరణ జరగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి, నాయకుల పట్టింపులేనితనానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. ఆలయా భవనాలలో కొనసాగుతున్న కార్యాలయాల్లో వసతులు లేమి ప్రజలకు అసౌకర్యంగా మారిందని జిల్లా అధికారులు జోక్యం చేసుకొని కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# రాజాసింగ్... లక్ష్మణ... నెక్స్ట్ ఎవరు

హైదరాబాద్, జూలై 14, బీజేపీ అంటేనే క్రమశిక్షణ గల పార్టీ. అధికారం కోసం, పదవుల కోసం కాకుండా సిద్ధాంతం కోసం పనిచేసే కార్యకర్తలు ఉంటారు. కానీ, మోదీ ప్రధాని అయ్యాక దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఇందుకోసం బీజేపీ వివిధ పార్టీల్లోని కీలక నాయకులను చేర్చుకుంది. దీంతో పార్టీ సిద్ధాంతం పక్కకుపోయింది. దీంతో పాత కొత్తల కలయిక కొన్ని రాష్ట్రాల్లో పార్టీకి ఇబ్బందిగా మారుతోంది. తెలంగాణలో కూడా అదే పరిస్థితి నెలకొంది. ఇందుకు మొన్న రాజీసింగ్, ఈ రోజు లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనం.తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేస్తామని హామీ ఇచ్చింది. ప్రధా మోదీ స్వయంగా ప్రకటించారు. ఈ ప్రకటన రాజకీయ చర్చకు దారితీసింది. ఈ క్రమంలో తాజాగా బీజేపీ నేత కె.లక్ష్మణ్, ఇతర రాష్ట్రాల్లో బీసీలను ముఖ్యమంత్రులుగా నియమించిన చరిత్రను గుర్తు చేస్తూ, ఈ హామీని పునరుద్ఘాటించారు. అదే సమయంలో, ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా, దానిని జాతీయ నాయకత్వం ఆమోదించడం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.బీజేపీ తెలంగాణలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా నియమిస్తామని 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఈ హామీని పునరుద్ఘాటిస్తూ, బీజేపీ నేత కె.లక్ష్మణ్, ఇతర రాష్ట్రాల్లో బీసీ నేతలను ముఖ్యమంత్రులుగా చేసిన చరిత్రను ఉదాహరణగా చూపారు. ఈ ప్రకటన తెలంగాణలో బీసీ ఓటర్లను ఆకర్షించే లక్ష్యంతో చేసిన రాజకీయ వ్యూహంగా కనిపిస్తుంది, ఎందుకంటే రాష్ట్రంలో బీసీలు జనాభాలో సగానికి పైగా ఉన్నారు. బీసీ ఓటర్లు రాజకీయంగా నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. బీజేపీ ఈ హామీ ద్వారా బీసీ సమాజాన్ని ఏకతాటిపైకి తెచ్చి, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో పోటీ పడేందుకు ప్రయత్నిస్తోంది. అయితే, ఈ హామీ నిజమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందా లేక ఎన్నికల వ్యూహంగా మాత్రమే పరిమితమవుతుందా అనేది చర్చనీయాంశం.గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను రాష్ట్ర బీజేపీ జాతీయ నాయకత్వానికి పంపింది, దానిని జాతీయ నాయకత్వం ఆమోదించింది. ఈ రాజీనామా బీజేపీలో అంతర్గత ఇబ్బందులను సూచిస్తుంది. రాజాసింగ్ రాజీనామా వెనుక బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించే ఉద్దేశం ఉందా లేక ఇతర రాజకీయ కారణాలు ఉన్నాయా అనేది స్పష్టంగా తెలియలేదు. ఈ రాజీనామా బీసీ సీఎం హామీతో నేరుగా సంబంధం కలిగి ఉందా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.కె.లక్ష్మణ్, బీజేపీ ఇతర రాష్ట్రాల్లో బీసీలను ముఖ్యమంత్రులుగా నియమించిన చరిత్రను ఉదహరించారు.

ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్‌లో కల్యాణ్ సింగ్, బిహార్‌లో నితీష్ కుమార్ (సంబంధిత సమయంలో బీజేపీ మిత్రపక్షం) వంటి బీసీ నేతలు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. తెలంగాణలో కూడా బీజేపీ గతంలో బీసీ నేతలైన చలపతిరావు, బండారు దత్తాత్రేయ, బండి సంజయ్‌లను రాష్ట్ర అధ్యక్షులుగా నియమించింది. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్ మాత్రం తాజాగా బీసీకి అధ్యక్ష పగ్గాలు అప్పగించకపోవడాన్ని తప్పు పడుతున్నాయి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీజేపీ బీసీలపై "మొసలి కన్నీరు" కారుస్తోందని, రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వలేదని ప్రశ్నించారు.ఇదిలా ఉంటే.. బీజేపీ అధ్యక్ష పగ్గాలు ఆ పార్టీలో అంతర్గత ఒత్తిడికి దారితీసినట్లు తెలుస్తోంది.గతంలో బీసీ నేతలైన ఈటల రాజేందర్, డీకే.అరుణ, ధర్మపురి అర్వింద్ వంటి వారిని ప్రముఖ పదవులకు పరిగణించినప్పటికీ, రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం బీసీ నేతను ఎంపిక చేయకపోవడం విమర్శలకు దారితీసింది. ఈ క్రమంలో బీసీ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా, తాజాగా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ బీసీ ముఖ్యమంత్రి అంటూ చేసిన వ్యాఖ్యలు అసలు బీజేపీలో ఏం జరుగుతోంది అన్న చర్చకు దారితీశాయి.

# తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు చేసిన రాచకొండ పోలీసులు

## తీన్మార్ మల్లన్న కార్యాలయంపై జాగృతి కార్యకర్తలు దాడి, ఫర్నీచర్ ధ్వంసం

## గాలిలోకి కాల్పులు జరిపిన తీన్మార్ మల్లన్న గన్ మెన్

హైదరాబాద్, జూలై 14,ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఇటీవల తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ఆగ్రహించిన తెలంగాణ జాగృతి కార్యకర్తలు నిన్న ఉదయం మేడిపల్లిలోని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడికి దిగారు.కవిత చేస్తున్న బీసీ ఉద్యమాన్ని మల్లన్న తప్పుబడుతూ వ్యాఖ్యలు చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఫర్నీచర్, కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ, తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఆందోళనకారులను అడ్డుకునేందుకు తీన్మార్ మల్లన్న గన్ మెన్ గాల్లోకి ఆరు రౌండ్లు కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ ఘటనలో జాగృతి కార్యకర్త సాయికి బుల్లెట్ గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నాయి.తొలుత తీన్మార్ మల్లన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తెలంగాణ జాగృతి కార్యకర్తలు కవిత ప్రేరణతో తమపై దాడికి దిగారని, ఆస్తిని ధ్వంసం చేసి తనను హత్య చేసేందుకు యత్నించారని తీన్మార్ మల్లన్న ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఐపీసీ 147, 148, 452, 307, 427, 506, 353 రెడ్ విత్ 149, 109 సెక్షన్లతో పాటు బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.మరోవైపు జాగృతి కార్యకర్త లింగమయ్య అలియాస్ అశోక్ యాదవ్ ఫిర్యాదు మేరకు తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు అయింది. మల్లన్న వ్యాఖ్యలపై ప్రశ్నించేందుకు క్యూన్యూస్ కార్యాలయం వద్దకు వెళ్లగా, మల్లన్న వర్గం తమపై దాడి చేసి కత్తులు, తుపాకులతో మహిళలను బెదిరించారని, మర్యాదకు భంగం కలిగించారని ఆరోపించారు. దీనిపై 354 బీ, 307, 506, 147, 148, ఆర్మ్స్ యాక్ట్ 25, 27 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

# కలగా మారుతున్న గిరిజన వర్సిటీ...

అదిలాబాద్, జూలై 14, అడవుల జిల్లా ఆదిలాబాద్ అంటేనే... ఆదివాసీలు. అలాంటి ఆదిలాబాద్‌కు గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ గతంలో పాలకులు ప్రకటన సైతం చేశారు. కానీ యూనివర్సిటీ ఏర్పాటు కల నేటికి నెరవేరకపోవడంతో, జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కల కలగానే మిగిలిపోనుందా అని జిల్లా ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఉన్నత విద్యా సంస్థల స్థాపనకు అనువైన ప్రాంతాల అధ్యయనానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నియమించిన ప్రొఫెసర్ల కమిటీ ఆదిలాబాద్ ప్రాంతంలో ఉన్నత విద్య సంస్థల ఏర్పాటుకు అనువైన అవకాశాలు పూర్తి స్థాయిలో ఉన్నాయని దింతో జిల్లాకు గిరిజన యూనివర్సిటీని ప్రకటించిన సంగతి తెలిసిందే. దశాబ్దాలుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు కాకపోవడం పాలకుల చిత్తశుద్ధికి అద్దంపడుతుంది. తెలంగాణ రాష్ట్రంలోని పాత 10 జిల్లాల్లో యూని వర్సిటీ లేని ఏకైక జిల్లాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిలిచింది.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సహజసిద్ధ ప్రకృతి వనరులకు, అడవులకు, భిన్న సంస్కృతి సంప్రదాయాలకు ప్రసిద్ధి. సింగరేణి బొగ్గు గనులు, సున్నపురాయి, కాగితపు పరిశ్రమ, మాంగనీస్ గను లు విస్తరించాయి. పెన్ గంగా, గోదావరి, ప్రాణహిత, పెద్దవాగు నదులున్నాయి. మూడు కాలాల్లో నమోదయ్యే భిన్నమైన వాతావరణ స్థితిగతులు పరిశోధనలకు నెలవు. దేశంలోనే అత్యంత ప్రాముఖ్యత కల్గిన చదువుల తల్లి సరస్వతి దేవి కొలువైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విశ్వవిద్యాలయం లేకపోవడంతో ఈ ప్రాంత వాసులు ఉన్నత చదువుల కోసం అష్టకష్టాల నడుమ ఉమ్మడి జిల్లాను దాటి వేరే జిల్లాలకు వెళ్తున్నారు.మరికొంత మంది ఆర్థికభారం, దూరభారం వల్ల మధ్యలోనే చదువులకు స్వస్తి పలుకుతున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాలలో అంబేద్కర్ విశ్వవిద్యాల యం అధ్యయన కేంద్రాలు, దూర విద్యాకేంద్రాల ద్వారా పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయే తప్పితే పూర్తి స్థాయి పీజీ కోర్సుల కళాశాలలు లేకపోవడం ఉన్నత చదువుకు ప్రతికూలంగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత వాసులకు ఉన్నత చదువులకే కాకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.అత్యంత వెనుకబడిన జిల్లాగా పేరున్న ఉమ్మడి జిల్లాల్లో అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉండడం, సుమారు మూడు లక్షల యాభై వేలకు పైగా గిరిజనులు ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భౌగోళికంగా మహారాష్ట్ర, ఛత్తీషగఢ్‌లతో సరిహద్దును పంచుకోవడం, జిల్లా గుండా జాతీయ రహదారి 44 తో పాటు ఇతర రహదారులు వెళ్లడం, దక్షిణ మధ్య రైల్వే లైన్ జిల్లా నుండి వెళ్లడం, యూనివర్సిటీ ఏర్పాటుకు కావాల్సిన భూములు ఉన్నప్పటికీ గిరిజన విశ్వవిద్యాలయం జిల్లాలో ఏర్పాటు చేయించడంలో ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు వైఫల్యం చెందారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2008 లో కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. అదే సంవత్సరం నవంబర్ 17న జీవో 797 ను విడుదల చేసింది. అప్పట్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు 2011 ఆగస్టు 27న జీవో 783 ని జారీ చేసింది. దీంతో జిల్లా, ఐటీడీఏ అధికార యంత్రాంగం ఉట్నూర్ లో యూనివర్సిటీ ఏర్పాటుకు కావాల్సిన భూమిని గుర్తించింది. ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు కావాల్సిన యూనివర్సిటీ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ములుగు జిల్లాకు తరలించుకుపోయారు. ఉట్నూర్ లో ఏర్పాటు కావా ల్సిన గిరిజన విశ్వవిద్యాలయంను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధుల, రాజకీయ నాయకుల నిర్లక్ష్యం కారణంగానే ములుగు జిల్లాకు తరలిపోయిందని జిల్లా ప్రజలు పేర్కొంటున్నారు. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకై పాలకులపై స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేయలేకపోవడంతోనే జిల్లా నుండి గిరిజన యూ నివర్సిటీ తరలిపోయిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గిరిజన యూనివర్సిటీ ఏర్పా టు కోసం ఉద్యమాలు చేసామని ఈ ప్రాంత ఆదివాసీ, గిరిజన సంఘాల నేతలు, విద్యార్థి సంఘాల నేతలు, విద్యావేత్తలు, మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శ్యామ్ పిట్రోడా నేతృత్వంలోని నాలెడ్జ్ కమిషన్ సిఫార్సుల మేరకు ప్రతి జిల్లాలో విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాలని గతంలో కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ పట్టణాన్ని ఎంపిక చేశారు. దీనికి కారణం అప్పటికే కాకతీయ యూనివర్సిటీ కి అనుబంధంగా పీజీ కళాశాల భవనం ఉండటం, సుమారు 25 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న ఈ భవనంలో వసతులు, సౌకర్యాలకు కోదవలేకపోవడం సమీపంలో మరింత ప్రభుత్వ స్థలం ఉండటం వలన యూనివర్సిటీ ని ఏర్పాటు చేయవచ్చని భావించి మొదటి విడతగా 55 కోట్లు నిధులను కేటాయించారు. అప్పటి ప్రభుత్వ సిఫార్సుతో శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి పేరుతో సరస్వతి విశ్వవిద్యాలయం అని పేరును సైతం ప్రకటించా రు. కానీ ఆ సమయంలో రాష్ట్ర విభజన జరగడంతో యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదన అర్థాంతరంగా నిలిచిపోయింది. సుమారు రెండు దశాబ్దాల పాటు నిర్మల్ కేంద్రంగా నడిచిన కాకతీయ యూనివర్సిటీ అనుబంధ ప్రభుత్వ పీజీ కాలేజీ సైతం ప్రస్తుతం మూతపడింది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఒకే ఒక పీజీ సెంటర్ కూడా మూతపడింది.హైదరాబాద్ జే.ఎన్.టీ.యూకు అనుబంధంగా ఆదిలాబాద్ జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు గత ప్రభుత్వం జీవో నంబర్ 67 ను విడుదల చేసింది. కళాశాల ఏర్పాటు అవుతుందన్న తరుణంలో స్థల సేకరణ జరగక అది మరుగున పడింది. అ తర్వాత శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు రావడంతో కళాశాల ఏర్పాటు ప్రతిపాదన మరుగునపడిపోయింది. నిర్మల్‌కు చెందిన విద్యావేత్త, సామాజిక కార్యకర్త నంగే శ్రీనివాస్ శ్రీ జ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయ సాధన సమితిని ఏర్పాటు చేసి గత కొన్నేళ్లుగా సరస్వతీ విశ్వవిద్యాలయం పేరుతో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ఇప్పటికే పలుమార్లు ఉన్నత అధికారులను, కేంద్ర, రాష్ట్ర ప్రజా ప్రతినిధులను కలిసి యూనివర్సిటీ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. ఇటీవలే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ ప్రముఖ పత్రిక ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఏర్పాటు ఆవశ్యకత పై విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాల నేతలు, రాజకీయ పార్టీల నేతలతో చర్చా వేదిక ను నిర్వహించింది. ఈ చర్చా వేదికలో పాల్గొన్న ప్రతి ఒక్కరు ముక్తకంఠంతో యూనివర్సిటీ ఏర్పాటు కావాల్సిందే అని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు గతంలో కేటాయించిన గిరిజన యూనివర్సిటీని ఎట్టి పరిస్థితిలో ఏర్పాటు చేయాలి, దీనికోసం గతంలో ఎన్నో ఉద్యమాలు చేపట్టాం. రానున్న రోజుల్లో సైతం ఉద్యమాలు చేపడతాం. ఇటీవల జరిగిన చర్చా వేదిక అనంతరం విద్యావేత్త, సామాజిక కార్యకర్త బద్దం పురుషోత్తం రెడ్డి సారథ్యంలో యూనివర్సిటీ సాధన జేఏసీ ని ఏర్పాటు చేసింది. వీరు త్వరలోనే తమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

# కవితకు బీఆర్ఎస్ సపోర్టు ఏది ?

హైదరాబాద్, జూలై 14, రాజకీయాలు పక్కన పెడితే కల్వకుంట్ల కవిత కేసీఆర్ కుమార్తె. ఆమెకు కష్టం వస్తే.. రాజకీయాలకు అతీతంగా వ్యక్తిగతంగా అయినా బీఆర్ఎస్ నేతలు, కుటుంబసభ్యులు మద్దతుగా నిలబడేందుకు అందరూ ముందుకు రావాల్సి ఉంటుంది. ఎందుకంటే రాజకీయాలు వేరు.. వ్యక్తిగత సంబంధాలు వేరు. కానీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన అనుచితమైన వ్యాఖ్యల విషయంలో అలాంటి సపోర్టు కవితకు లభించలేదు. అవి ఆమె వ్యక్తిత్వాన్ని కించ పరిచేలా ఉన్నాయి. ఇంటి ఆడపడుచుపై అలాంటి వ్యాఖ్యలు చేస్తే ఖచ్చితంగా ఆమెకు మద్దతుగా ఉండాలి. కానీ బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇదే అందర్నీ ఆశ్చర్య పరుస్తోంది.కవిత రాజకీయంగా కేటీఆర్ తో విబేధిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం ఆయనది మాత్రమే కాదని తనది కూడా అని ఆమె చెబుతున్నారు. పార్టీ వ్యవహారాల్లో సరైన పాత్ర లేదని జాగృతి పేరుతో రాజకీయాలు చేసుకుంటున్నారు. కానీ బహిరంగంగా ఎప్పుడూ ఆమె బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రకటనలు చేయలేదు. కేసీఆర్ తమ నాయకుడు అనే అంటున్నారు. కానీ ఆమె ప్రత్యేకమైన దారిలో ఉన్నారని బీఆర్ఎస్ నేతలకు అర్థం కావడంతో ఆమెను దూరం పెట్టారు. ఆమె గురించి పట్టించుకోవడంలేదని లేదు. రాజకీయంగా అది వారి వ్యూహం కావొచ్చు కానీ.. వ్యక్తిగతంగా సమస్య వచ్చినప్పుడు మాత్రం కుటుంబపరంగా అయినా మద్దతుగా ఉండకపోతే చెడ్డపేరు తీసుకు వస్తుంది.తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు కవితను బాధపెట్టాయి. ఆ వ్యాఖ్యలు చాలా ఘోరంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మోటు సామెతల్ని తీసుకువచ్చి రాజకీయాల్లో అన్వయిస్తే ఘోరమైన అర్థాలు వస్తాయి. తన మాటల్ని తీన్మార్ మల్లన్న సమర్థించుకుంటున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు ముదురుతుంది. కవితకు ఎంత మద్దతు లభిస్తే అంత ధైర్యంగా ఉంటారు. కానీ కవితకు సొంత పార్టీ నుంచే మద్దతు కరవయింది. ఇప్పుడు కవితకు.. తనకు మద్దతు ఎవరు.. ఎవరు కాదు అన్నదానిపై ఓ స్పష్టత వచ్చి ఉంటుంది. కానీ కుటుంబ పరమైన బంధాలు కూడా ప్రస్తుత పరిణామాల వల్ల ప్రభావితం అయ్యే ప్రమాదం ఉంది.కవిత సొంత రాజకీయాలు చేయాలని ప్లాన్ చేసుకున్న తర్వాత ఇక తనకు ఎలాంటి మద్దతు రాదు అని ఒంటరి పోరాటం చేయాల్సిందేనని ఫిక్సయి ఉంటే.. ప్రస్తుత పరిణామాలపై ఆమె పెద్దగా ఆశ్చర్యపోరు. కానీ వ్యక్తిగత దాడి జరిగినప్పుడు కూడా కుటుంబసభ్యులు మద్దతు తెలియచేయలేదని ఫీలయితే మాత్రం కవిత రాజకీయాలు కొత్త దారిలోకి వెళ్లే అవకాశం ఉందని భావిస్తున్నారు.



# ఆరాంఘర్ లో ఆర్టీసీ బస్ స్టేషన్...

హైదరాబాద్, జూలై 14,హైదరాబాద్‌లో రాష్ట్ర, అంతర్రాష్ట్ర బస్సుల కోసం మరో భారీ బస్ టెర్మినల్ అందుబాటులోకి రానుంది. మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అంతర్రాష్ట్ర బస్సుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సులు నగరంలో ట్రాఫిక్‌జామ్ సమస్యల కారణంగా ఎంజీబీఎస్‌కు (మహాత్మా గాంధీ బస్ స్టేషన్) ఆలస్యంగా చేరుకుంటున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ఆధునిక బస్ టెర్మినల్ ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళిక రూపొందించారు.జాతీయ రహదారి 44కు పక్కనే ఆరాంఘర్‌లో 7.22 ఎకరాల స్థలాన్ని ఆర్టీసీ గుర్తించింది. ఈ స్థలంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ (ఐసీఎస్‌డబ్ల్యూ) భవనాలున్నాయి. వాటికి పరిహారంగా రూ. 6 కోట్లు చెల్లించేందుకు ఆర్టీసీ ముందుకు వచ్చింది. ఈ భూమిని ఆర్టీసీ బస్ టెర్మినల్‌కు కేటాయించాలని కోరుతూ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 2025 జనవరి 25న రెవెన్యూశాఖకు లేఖ రాశారు. అయితే ఆరు నెలలు దాటినా ఈ అంశం ఇంకా కొలిక్కిరాలేదు. ఈ భూకేటా యింపు ప్రతిపాదన రంగారెడ్డి కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే నగరంలో ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్ ఏర్పాటుకు అడుగు పడుతుంది.ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రెండు ప్రధాన భారీ బస్ టెర్మినల్స్ ఉన్నాయి మహాత్మా గాంధీ బస్ స్టేషన్ హైదరాబా ద్‌లోని అతిపెద్ద, ముఖ్యమైన బస్ స్టేషన్లలో ఒకటి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, అలాగే పొరుగు రాష్ట్రాలకు వెళ్లే బస్సులకు ఇది ప్రధాన కేంద్రం. ప్రతిరోజు లక్షలాది మంది ప్రయాణికులు దీని ద్వారా రాకపోకలు సాగిస్తారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ సమీపంలోని జుబ్లీ బస్ స్టేషన్ ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సేవలందిస్తుంది. కొత్త బస్ టెర్మినల్ అందుబాటులోకి వస్తే దక్షిణ తెలంగాణ జిల్లాల నుండి వచ్చే బస్సులకు, అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల నుండి వచ్చే బస్సులకు ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది.

# మాటల మంటలు

హైదరాబాద్, జూలై 14, రైతులకు ఎవరు ఏం చేశారు చర్చిద్దాం రండి అంటూ ఇటీవల తెలంగా సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, బీజేపీ నేత, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సవాల్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్‌ను స్వీకరించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు జూలై 8న రావాలని ప్లేస్, టైం ఫిక్స్ చేశాడు. కానీ ఆరోజు రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. కేటీఆర్ వచ్చి.. సీఎంను నాలుగు మాటలు అని వెళ్లిపోయాడు. ఇక ఇప్పుడు కేసీఆర్ కూతురు, జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత రంగంలోకి దిగారు. అన్నతో కాని పని నేను చేస్తా అన్నట్లు ఆమె కూడా సీఎం రేవంత్‌రెడ్డికే సవాల్ విసిరారు.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని బహిరంగ చర్చకు సవాల్ చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నలు సంధించారు. అంతేకాక, ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. ఈ సందర్భంగా కవిత, పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మహిళలతో వచ్చి చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ముఖ్యంగా మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, ఆసరా పెన్షన్ల రెట్టింపు, ఇతర సంక్షేమ పథకాల అమలు వైఫల్యంపై సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో తెలంగాణ జాగృతి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తూ, మాజీ సీఎం కేసీఆర్‌ను అసెంబ్లీకి రమ్మని అనవసరంగా రాగం తీస్తున్నారని విమర్శించారు. మహిళల హక్కుల కోసం పోరాడుతూ, కవిత పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు మహిళలతో వచ్చి హామీలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సవాల్ విసిరారు.కవిత, భద్రాచలం దేవస్థానం పరిధిలోని ఐదు గ్రామాలు (సుమారు 1,000 ఎకరాల ఆలయ భూములతో సహా) ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన అంశాన్ని లేవనెత్తారు. ఈ గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఆమె ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతోపాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖలు రాస్తున్నట్లు ప్రకటించారు. ఈ గ్రామాల విలీనం, ఆంధ్రప్రదేశ్ రీఆర్గనైజేషన్ యాక్ట్ 2014లో భాగంగా జరిగినప్పటికీ, తెలంగాణ ప్రజల స్వాభిమానంతో ముడిపడిన అంశంగా కవిత దీనిని హైలైట్ చేశారు. ఈ గ్రామాల విషయంలో కవిత డిమాండ్, తెలంగాణ సెంటిమెంట్‌ను రాజకీయంగా ఉపయోగించే ప్రయత్నంగా కనిపిస్తుంది. రాష్ట్ర విభజన తర్వాత ఆస్తులు, నీటి వనరులు, మరియు ఇతర విషయాలపై తెలంగాణ. ఆంధ్రప్రదేశ్ మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. కవిత ఈ అంశాన్ని లేవనెత్తడం ద్వారా, తెలంగాణ ప్రజల స్వాభిమానాన్ని కాపాడే నాయకురాలిగా తన ఇమేజ్‌ను బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.కవిత సవాల్,ఐదు గ్రామాల డిమాండ్, బీఆర్ఎస్ రాజకీయంగా బలహీనంగా ఉన్న సమయంలో వచ్చాయి.

# వేములవాడలో కూల్చివేతలు ఉద్రిక్తత

వేములవాడ,వేములవాడలో రెండో బ్రిడ్జి నిర్మాణం కోసం తిప్పాపురం బస్టాండ్ ఎదురుగా ఉన్న నిర్మాణాల తొలగింపును నిర్వాసితులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు నిర్వాసితులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఒక మహిళ స్పృహతప్పి పడిపోయింది. అధికారులను దూషిస్తు ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టింది. మహిళను అదుపులోకి తీసుకున్నారు. బలవంతంగా ఖాళీ చేయించడంపై నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేసారు. నష్టపరిహారం ఇవ్వకుండా దౌర్జన్యంగా కూల్చివేయడం ఏంటని నిలదీసారు. స్వచ్ఛందంగా తొలగించేందుకు సిద్ధమైనప్పటికి దౌర్జన్యంగా కూల్చివేస్తున్నారని ఆందోళన పడ్డారు. వేములవాడ లో రోడ్డు అడ్డంగా ఉన్న నిర్మాణాల తొలగింపుకు 15 రోజుల క్రితమే అధికారులు నోటీసులు జారీ చేసారు. నోటీసుల గడువు ముగియడంతో 30 ఇళ్ళ కూల్చివేతలు ప్రారంభించారు. తమకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండానే ఇళ్లను కూల్చుతున్నారని బాధితుల ఆవేదన. కూల్చివేతలకు ముందే పరిహారం కోర్టులో జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. కూల్చివేతలను నిరసిస్తూ హోర్డింగ్ ఎక్కి నిర్వాసితుడు ఆందోళనకు దిగాడు.జ

# రెండో భూ సేకరణకు బ్రేక్..?

అమరావతి, జూలై 14, అమరావతి రెండో విడత భూ సేకరణ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గిందా? సీఎం చంద్రబాబు పునరాలోచనలో పడ్డారా? తాత్కాలికంగా వాయిదా వేయడానికి సిద్ధపడ్డారా? క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయనున్నారా? అమరావతి రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జూన్ 25న జరిగిన క్యాబినెట్ సమావేశంలో అమరావతి భూ సేకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గత కొద్దిరోజులుగా అమరావతి ప్రాంతంలో అదనపు భూముల సేకరణకు సంబంధించి ప్రక్రియ ప్రారంభం అయింది. అయితే గతం మాదిరిగా అమరావతి రైతుల నుంచి అనుకున్న స్థాయిలో ఆసక్తి మాత్రం కనిపించలేదు. దీంతో తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ విషయం చర్చకు వచ్చింది. డిప్యూటీ సీఎం పవన్ తో పాటు మంత్రుల అభిప్రాయం మేరకు చంద్రబాబు ఈ విషయంలో వెనక్కి తగ్గినట్లు ప్రచారం సాగుతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతికి కొత్త కళ వచ్చింది. ముందుగా జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభమయ్యాయి. అమరావతి యధా స్థానానికి వచ్చింది. అదే సమయంలో గత ఏడాదిగా నిధుల సమీకరణ పై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వ హామీతో ప్రపంచ బ్యాంకు తోపాటు ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ నుంచి 15 వేల కోట్ల రూపాయల రుణం అందింది. ఇతర మార్గాల్లో సైతం నిధుల సమీకరణ పూర్తయింది. దీంతో టెండర్లు ఖరారు అయ్యాయి. మరో రెండు నెలల్లో వేలాదిమంది ఇంజనీర్ల పర్యవేక్షణలో అహోరాత్రులు పనులు చేయించి అమరావతి నిర్మాణ పనులను కొలిక్కి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే అంతర్జాతీయ నగరాల సరసన అమరావతిని చేర్చాలని చంద్రబాబు సర్కార్ గట్టి సంకల్పంతో ఉంది. అందుకే అదనంగా మరో 35 వేల ఎకరాల భూమిని సేకరించాలని భావించింది. అంతర్జాతీయ విమానాశ్రయం తో పాటు మరికొన్ని నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రణాళిక వేసుకుంది. ఓ పదివేల ఎకరాల భూమిని ప్రభుత్వం తన వద్ద ఉంచుకోవాలని చూసింది. అయితే ఇది మంచి ఆలోచన అయినా.. అమరావతి రైతుల్లో అనేక రకాల అనుమానాలు ప్రారంభం అయ్యాయి. గత ఐదేళ్ల వైసిపి విధ్వంసాన్ని గుర్తించుకొని.. లేనిపోని ఇబ్బందులు ఎందుకన్నది అమరావతి రైతుల అభిప్రాయం. చంద్రబాబు సమర్థతపై వారికి నమ్మకం ఉన్నా.. ఒకవేళ భవిష్యత్తులో అధికారం మారితే పరిస్థితి ఏంటన్న అనుమానం మాత్రం వారిని వెంటాడుతోంది. అందుకే వారంతా ఈ అదనపు భూసేకరణను వ్యతిరేకిస్తున్నారు. తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు కొందరు మంత్రులు. అదనపు భూసేకరణకు అమరావతి రైతులు వ్యతిరేకిస్తున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. అదే సమయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం స్పందించారు. అదనపు భూసేకరణ పేరుతో లేనిపోని ఇబ్బందులు ఎందుకని అన్నారు. అమరావతి రాజధాని భూ సేకరణకు సంబంధించి మంత్రులు ఇష్టారాజ్యంగా ప్రకటనలు చేయడాన్ని కూడా ప్రస్తావించారు. ఇప్పటివరకు అమరావతి రాజధానిని వ్యతిరేకించిన వైసీపీ వర్గాలకు ఇది అవకాశం ఇచ్చినట్టు అవుతుందని కూడా చెప్పుకొచ్చారు. దీంతో చంద్రబాబు ఆలోచనలో పడ్డారు. టిడిపి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా జనసేన అధినేత పవన్ మాట్లాడిన సందర్భం కూడా ఇది తొలిసారి. దీనిపై చంద్రబాబు స్పందించారు. క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుచేసి అమరావతి రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుందామని చెప్పారు. అందుకే ఇప్పుడు అమరావతిలో అదనపు భూసేకరణకు సంబంధించి ప్రక్రియ నిలిచిపోయినట్లు తెలుస్తోంది.

# గుడివాడలో రప్పా రప్పా రాజకీయాలు

విజయవాడ, జూలై 14, గుడివాడలో టీడీపీ, వైసీపీ మధ్య రోజంతా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గుడివాడ నియోజకవర్గంలో వైసీపీ , టీడీపీ రెండు ఒకే రోజు నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలు పెట్టుకున్నాయి. బాబు షూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో వైసీపీ విస్తృత స్థాయి సభ ఏర్పాటు చేసింది. ఏడాది పాలన అయిన సందర్భంగా టీడీపీ కూడా తొలి అడుగు కార్యక్రమం ఏర్పాటు చేసుకుంది. అదే సమయంలో వైసీపీ కార్యక్రమానికి కొడాలి నాని వస్తారన్న ప్రచారం జరిగింది. రప్పా రప్పా నరుకుతామని పేర్ని నాని హెచ్చరించిన వీడియో వైరల్ అయిన సమయంలో.. ఆయన కూడా వస్తారని తెలియడంతో టీడీపీ కార్యకర్తలు.. పెద్ద ఎత్తున గుడివాడలో గుమికూడారు. అదే సమయంలో మాజీమంత్రి కొడాలి నాని, సీఎం చంద్రబాబు బూట్ పాలిష్ చేస్తున్నట్లు నెహ్రూ చౌక్ సెంటర్లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కుప్పంలో చంద్రబాబు గెలిస్తే...బూట్ పాలిష్ చేసి కాళ్ళ దగ్గర ఉంటానంటూ కొడాలి నాని చేసిన చాలెంజ్ నిలబెట్టుకోవాలంటూ..గుడివాడ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. వైసీపీ నేతలు కూడా మోసం గ్యారంటీ ఫ్లెక్సీలు వేశారు. అయితే వాటిని టీడీపీ కార్యకర్తలు చింపేశారు. ఉద్రిక్త పరిస్థితి ఏర్పడటంతో కొడాలి నాని సమావేశానికి రాలేదు. గుడివాడ వన్ టౌన్ పీఎస్ లో సంతకం చేసి హైదరాబాద్ వెళ్లిపోయారు కొడాలి నాని. ముఖ్యమైన నాయకులు ఎవరూ రాకపోవడంతో.. ద్వితీయ శ్రేణి నేతలతోనే గుడివాడ నియోజకవర్గంలో సమావేశాన్ని పూర్తి చేశారు. రప్పా రప్పా మీతోనే మొదలు పెడుతామని.. కొడాలి నాని ముఖ్య అనుచరుడు మెరుగుమాల కాళీ సమావేశంలో హెచ్చరిచారు. అదే సమయంలో గుడివాడ పట్టణంలోని 19, 20, 23, 24వ వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఒఖూచిఅ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు తో కలిసి కూటమి ప్రభుత్వం ఏడాదిలో అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రజలకు వివరించారు. వైసీపీ ముఖ్యనేతలెవరూ గుడివాడ రాకపోవడంతో.. ఉద్రిక్తలు ఘర్షణల వరకూ వెళ్లకుండా ఆగిపోయాయి. ఏపీ మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత పేర్ని నాని ఏపీలో అల్లర్లకు తెరలేపాలని కుట్ర పన్నుతున్నట్లు తెలుస్తోంది. గుడివాడ వివాదంపై పేర్ని నాని ఫోన్ సంభాషణ లీక్ అయ్యింది. గుడివాడ వివాదంతో రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు సృష్టించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు ఆయన మాటల్లో తెలుస్తోంది. గుడివాడ ఘటనను బీసీ మహిళాపై జరిగిన దాడిగా చిత్రీకరించాలని, దాడి నారా లోకేశ్?పైకి తోసేద్దామని ఆయన అన్నారు.'గుడివాడలో జడ్పీ ఛైర్?పర్సన్? కారుపై జరిగిన దాడి ఘటనను ఓ బీసీ మహిళాపై దాడి అంటూ రాష్ట్రవ్యాప్తంగా మనవాళ్లందరితో కలిసి గోల చేయించాలి. బీసీ గౌడ మహిళ అని అందరూ బయటకొచ్చి చెప్పాలి. పైనుంచి లోకేశ్ చెప్పడంతో గుడివాడ తెదేపా ఎమ్మెల్యే, అతని అనుచరులు చేశారని ప్రచారం చేద్దాంజ మన వాళ్లందరికీ మన నాయకుడి(జగన్)తో చెప్పిస్తేనే అందరూ గట్టిగా చేస్తారు. మన నాయకుడు చెబితేనే వింటారు. రాష్ట్రవ్యాప్తంగా గట్టిగా కులం పేరుతో ఆందోళనలు చేద్దాం' అని పేర్ని నాని మాట్లాడిన ఫోన్ సంభాషణ తాజాగా లీక్? అయ్యింది. కూటమి ప్రభుత్వానికి, వైకాపా మధ్య జరిగిన గొడవకు కులం రంగు పులిమి వివాదం చేయాలని నాని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. వీడియో కాల్? లీక్? అవడంతో.. ఇదీ పేర్ని నాని నిజ స్వరూపమని కూటమి నేతలు మండిపడుతున్నారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలని కుయుక్తులు పన్నుతున్నారని ఫైర్? అవుతున్నారు. నీచమైన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ నేతల్ని చంపాలని పార్టీ కార్యకర్తల్ని రెచ్చగొడుతున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న కొన్ని గంటల్లోనే ఈ వీడియో కాల్? లీక్? అయ్యింది. అంతకుముందు ఆయన ఆయన తమ పార్టీ నేతలకు ప్రత్యర్థులను ఎలా చంపాలో హితబోధ చేశారు. “చీకట్లో కన్ను కొట్టి చంపేయాలి .. ఉదయమే వెళ్లి ఏమీ తెలియనట్లుగా పరామర్శించాలని” సూచించారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పేర్ని నాని గతంలో కూడా టీడీపీ నాయకులపై పలుమార్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

# త్వరలో పదవుల పండుగ...

గుంటూరు, జూలై 14,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు లేదా ఎల్లుండి పార్టీ నేతలకు గుడ్ న్యూస్ చెప్పే అవకాశముంది. ఈ నెల 15వ తేదీ ఉదయం చంద్రబాబు ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఈలోపు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని చంద్రబాబు నిర్ణయించారు. ఇప్పటికే పలు మార్లు నామినేటెడ్ పోస్టులను ప్రకటించిన చంద్రబాబు మరోసారి నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయడానికి సిద్ధమవుతున్నారు. రేపు సాయంత్రం నామినేటెడ్ పోస్టుల భర్తీపై ప్రకటన వెలువడే అవకాశముంది. ఇందుకోసం పార్టీ నేతలు కూడా కసరత్తులు చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఈ నెల 15వ తేదీలోగా నామినేటెడ్ పోస్టులకు సంబంధించిన జాబితాను పంపాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా... కేవలం నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు పంపిన జాబితా మాత్రమే కాకుండా ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా కార్యకర్తల అభిప్రాయాన్ని కూడా సేకరించి నామినేటెడ్ పదవులను భర్తీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో నామినేటెడ పోస్టులు కూడా మూడు పార్టీలకు పంచేందుకు చంద్రబాబు జాబితాను ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిసింది. టీడీపీకి ఇందులో ఎక్కువగా పోస్టులు దక్కనుండగా, ఆ తర్వాత జనసేన పార్టీకి, అనంతరం బీజేపీకి కూడా కొన్ని స్థానాలను కేటాయించ నున్నారు. ఇప్పటికే జనసేన, బీజేపీల నుంచి కూడా నామినేటెడ పోస్టుల కోసం జాబితాను అడగ్గా వారు కొన్ని పేర్లను ఇచ్చినట్లు సమాచారం. గత ఎన్నికల్లో పదవులు దక్కని వారితో పాటు, పార్టీ విజయం కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారని చెబుతున్నారు. అయితే ఇప్పటికే ఎమ్మెల్యేల నుంచి వచ్చి పేర్లను టీడీపీ మంగళగిరి కేంద్ర కార్యాలయంలో జాబితాను వడపోసి చంద్రబాబుకు అందచేసినట్లు సమాచారం. చంద్రబాబు వడపోత పట్టిన తర్వాత రేపు సాయంత్రం లేదా పదిహేనో తేదీ ఉదయం నామినేటెడ్ పోస్టులను ప్రకటించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబు ఢిల్లీకి బయలుదేరి వెళ్లే ముందు ఈజాబితాను ప్రకటిస్తారని తెలిసింది. అందుకోసమే ఆయన ముఖ్యమైన నేతల పేర్లు మిస్ కాకుండా పార్టీ విజయం కోసం కష్టపడిన వారందరికీ పదవులు ఇవ్వనున్నారుప్రధా నంగా రాష్ట్రంలో ఉన్న 2028 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, 491 సొసైటీలకు ఛైర్మన్ లతో పాటు 900 దేవాలయాలకు ఛైర్మన్లతో పాటు పాలకవర్గాన్ని కూడా నియమించాలి. మార్కెట్ కమిటీలను కూడా నియమించాల్సి ఉంది. అయితే అన్నింటినీ భర్తీ చేస్తారా? లేక వీటిలోకొన్నింటిని మాత్రమే భర్తీ చేసి మరికొన్నింటిని హోల్డ్ లో పెడతారా? అన్నది మా?రం తెలియరాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుండటంతో నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీ చేసి నేతలకు పదవులు ఇవ్వాలన్న ఆలోచనలో చంద్రబాబు ఉణ్నారు. దీంతో రేపో, మాపో టీడీపీ నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపికబురు అందించే అవకాశాలున్నాయి.

# గుండెపోటుతో హెచ్ఎం మృతి

పాలకొల్లు ,పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం ఆరట్లకట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న ఎస్వీఆర్ మూర్తిరాజు, సోమవారం ఉదయం విధులకు హాజరైన కొంతసేపటికే గుండెపోటుకు గురై మృతి చెందారు.నల్లజర్లలో జరుగుతున్న లీడర్షిప్ ట్రైనింగ్ పేరిట ఎస్ఎల్డీటీ శిక్షణ తరగతులకు అయన రీసోర్స్ పర్సన్గా వున్నారు. ట్రైనింగ్ ప్రారంభం రోజునే విషాదం నెలకొంది. రాష్ట్రంలో వివిధ కార్యక్రమాలు యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్, లీడర్షిప్ ట్రైనింగ్ పేరిట ఉపాధ్యాయులకు వరుస కార్యక్రమాలివ్వండంతో ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి పడుతుందని ఉపాధ్యాయ సంఘాల ఆరోపణ. గత ఏడాది ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో జరిగిన ఇదే శిక్షణకు ఇద్దరు రువురు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర ఆసంతృప్తి నెలకొంది

# ఓటమిపై చర్చలెప్పుడు...

ఒంగోలు, జూలై 14, వైసీపీ అధినేత వైఎస్ జగన్ జిల్లాల పర్యటనలకు కొద్దిరోజులు విరామం ఇచ్చి నేతలతో సమావేశం అవ్వాలని కోరుతున్నారు. నేతలతో సమావేశమై ముందు గత ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను పూర్తి స్థాయి విశ్లేషించడానికి సమయం వెచ్చించాలని నేతలు సయితం కోరుతున్నారు. గత ఐదేళ్ల పాటు పార్టీ



అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పిదాలు, తీసుకున్న నిర్ణయాలు వంటి వాటిపై గ్రౌండ్ లెవెల్ లో ఏం జరుగుతుందన్న దానిపై నేతల నుంచి విడివిడిగా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని కోరుతున్నారు. సమావేశాల్లో తాను చెప్పడమే కాకుండా, తాను చెప్పింది విని నేతలు వెళ్లే పనికి స్వస్తి చెప్పి వారికి మైకు ఇచ్చి మాట్లాడించగలిగితే చాలా వరకూ సమస్యలు పరిష్కారమవుతాయని సూచిస్తున్నారు పర్యటనలను సక్సెస్ అవుతున్నాయంటే? జగన్ జిల్లాల పర్యటనలు సక్సెస్ అవుతున్నాయంటే అందుకు నేతలు, కార్యకర్తలు కారణం. ఎందుకంటే ఆంక్షలు పెట్టినా నేతలు, కార్యకర్తలు భయపడకుండా రోడ్డుపైకి వస్తున్నారంటున్నారు. అంత ఉత్సాహంతో పనిచేస్తున్న కార్యకర్తలు, నేతలు ఈసారి ఎన్నికలలో ఇచ్చే హామీలతో పాటు అధికారంలోకి వస్తే ఏం చేయాలన్న దానిపై జగన్ నుంచి క్లారిటీ వస్తే మరింత పార్టీకి హైప్ వస్తుందని చెబుతున్నారు. వాలంటీర్ల వ్యవస్థను జగన్ తీసుకు వచ్చి తప్పు చేశానని ఇంత వరకూ ఆయన అనలేదు.పైగా వాలంటీర్లను తొలగించడం అన్యాయమంటూ జగన్ అధికార టీడీపీ పై విమర్శలు చేస్తుండటంతో మళ్లీ అధికారంలోకి వస్తే వాలంటీర్ల వ్యవస్థను తిరిగి తెస్తారా? అన్న అనుమానం కార్యకర్తల్లో ఉంది.. వాలంటీర్లు తిరిగి వస్తే తాము పార్టీ కోసం కష్టపడినా ప్రయోజనం ఏముంటుందని పలువురు అప్పుడే ప్రశ్నిస్తున్నారు. అలాగే కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా ఎమ్మెల్యేలను కూడా ప్రజల్లో భాగస్వామ్యులను చేయగలిగేలా జగన్ పనితీరు ఉండాలని వైసీపీ నేతలు కోరుకుంటున్నారు. తమ చేత పంపిణీ చేయిచండంతో పాటు ప్రజలకు తమను దగ్గరకు చేర్చడం వంటి పనులను చేయగలిగితేనే ఈసారి గెలిచినా తగిన గుర్తింపు ఉంటుందని, లేకపోతే 2019 తర్వాత పరిస్థితి తిరిగి పునరావృతమవుతుందని, ఎన్ని లక్షల కోట్ల రూపాయలు బటన్ నొక్కి పంపిణీ చేసినా చివరకు ఎన్నికల సమయానికి అది ఏమాత్రం పనిచేయదని కూడా చెబుతున్నార. కార్యకర్తలకు ఈసారి తాను అధికారంలోకి వస్తే పెద్దపీట వేస్తానని, ప్రాధాన్యత ఇస్తానని జగన్ పదే పదే పలు సమావేశాల్లో చెబుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది. అధికారంలోకి రాగానే తాము ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కార్యకర్తలకు ఏం చేయగలరన్న దానిపై కూడా క్లారిటీ ఉండాలని క్యాడర్ అభిప్రాయపడుతుంది. ఎమ్మెల్యేలతో పాటు క్యాడర్ ను కూడా సరిగా చూసుకుంటేనే గెలుపు సాధ్యమవుతుందని, ఈ నాలుగేళ్లు కూడా తాను చెప్పిందే విని వెళ్లాలని కాకుండా, వారి నుంచి కూడా ఫీడ్ బ్యాక్ తీసుకుని దాని ప్రకారం ముందుకు వెళితే మంచి ఫలితాలు రాబట్టుకోవచ్చని, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని క్యాష్ చేసుకోవచ్చని పలువురు సూచిస్తున్నారు. మరి జగన్ నేతల మాట వింటారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# సీనియర్లకు మళ్లీ ఆశలు

కాకినాడ, జూలై 14, డీపీ అతిపెద్ద రీజనల్ పార్టీ. పైగా బలహీనవర్గాలకు పెద్దపీట అనే నినాదంతో వచ్చిన ఆ పార్టీ..ఎందరో సామాన్యులను నాయకులుగా తయారు చేసింది. అలా నాలుగున్నర దశాబ్ధాల టీడీపీ పార్టీలో..సీనియర్ మోస్ట్ లీడర్లు చాలా మందే ఉన్నారు. ఐదారుసార్లు మంత్రులుగా పనిచేసిన వారు..ఆరేడు సార్లు గెలిచిన వాళు ..సామాజిక వర్గాల వారీగా, ప్రాంతాల వారీగా సైకిల్ పార్టీకి బలమైన అనుభవమున్న నేతలు ఉన్నారు.అయితే గత ఎన్నికలకు ముందు పార్టీలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని..రాబోయే 40ఏళ్లు పార్టీ స్ట్రాంగ్గా నిలబడేలా నాయకత్వాన్ని పటిష్టం చేసుకోవాలనే ఆలోచనతో..చాలామంది జూనియర్లకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు సీఎం చంద్రబాబు. ఫస్ట్ టైమ్ గెలిచిన ఎమ్మెల్యేలను కూడా మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఇప్పుడున్న క్యాబినెట్లో 18మంది కొత్త ముఖాలే. అయితే ఈ మధ్య మంత్రుల పనితీరుపై చాలా సీరియస్గా ఉన్నారు చంద్రబాబు.పనితీరు బాలేదని ముఖం మీదే చెప్పయడమే కాదు..మంత్రివర్గంలో మార్పులు, చేర్పులకు రెడీ అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే శ్రావణమాసం రాగానే..క్యాబినెట్లో ఇప్పటికే ఖాళీగా ఉన్న ఓ పోస్ట్ను భర్తీ చేయడంతో పాటు..నలుగురు, ఐదుగుర్ని తొలగించి వారి స్థానంలో కొత్తవాళ్లను తీసుకుంటారన్న ప్రచారం బయలుదేరింది.పనితీరు బాలేని జూనియర్లను క్యాబినెట్ నుంచి తప్పిస్తారన్న ఊహాగానాలతో..సీనియర్లలో ఆశలు చిగురిస్తున్నాయట. ఉత్తరాంధ్ర టు రాయలసీమ వరకు టీడీపీలో చాలా మంది సీనియర్లు మంత్రి పదవి మీద ఆశలు పెట్టుకున్నారట. అయితే 2024లో బెర్త్ దొరకక కాస్త మౌనంగానే ఉంటూ వస్తున్నారు. జిల్లాలను శాసించే సీనియర్ లీడర్లు కాస్త..సొంత నియోజకవర్గాలకే పరిమితం అవుతూ వస్తున్నారు. అంతేకాదు వైసీపీపై విమర్శల విషయంలో కూడా మంత్రులదే బాధ్యత అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారట.అయితే సీనియర్ల లీడర్లతో అధినాయకత్వం బాగానే ఉంటోంది. మంత్రివర్గంలోకి తీసుకోకపోయినా..పెద్ద పెద్ద పోస్టులు ఇవ్వకపోయినా..పార్టీ కోసమే కొత్త నీరు అన్నట్లుగానే చెబుతూ వస్తోంది. ప్రభుత్వంలో పెద్దగా అనుభవం కలిగినవారు లేకపోవడంతో ధాటిగా విపక్షాల విమర్శలను తిప్పికొట్టలేకపోతున్నారట. ఇప్పుడున్న మంత్రివర్గంలో ఇద్దరు సీనియర్ లీడర్లు రామానాయుడు, పయ్యావుల కేశవ్ పనితీరు మీద మాత్రమే సీఎం సంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈసారి విస్తరణలో మళ్లీ సీనియర్లనే తీసుకుంటారని..తమకు అవకాశం దక్కబోతుందని హోప్స్ పెట్టుకుంటున్నారట సీనియర్ టీడీపీ లీడర్లుసబ్జెక్ట్పై పట్టుండేవారు.

# ఆచి తూచి అడుగులు వేసినా...

తిరుపతి, జూలై 14, జనసేన అధినేత పవన్ కల్యాణ్ 2014 లో పార్టీ పెట్టినా పార్టీని విస్తరించకపోవడానికి కారణం ప్రధానమైనది నేతలు పార్టీని ఇబ్బందిపెడతారనే. అందుకే ఆయన అన్ని నియోజకవర్గాల్లో ఇబ్బడి ముబ్బడిగా నేతలకు ఇన్ ఛార్జి పదవి ఇచ్చేసి జనసేన పార్టీని బలోపేతం చేయడానికి ప్రయత్నించలేదు. పార్టీ బలపడకపోయినా పరవాలేదు కానీ, నేతల వల్ల పార్టీకి, తనకు వ్యక్తిగతంగా చెడ్డపేరు రాకూడదనే గత పదేళ్ల నుంచి ఆయన ఆచితూచి నేతల విషయంలో నిర్ణయం తీసుకుంటున్నారు. తనకు నమ్మకమైన నేతలను మాత్రమే నియమించారు. అదీ తనకు సంబంధించిన వారు, దగ్గరగా ఉన్న వారు సిఫార్సు చేసిన వారికి మాత్రమే పదవులు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పెట్టి పదేళ్లవుతున్నా జనసేన బలోపేతం పై పవన్ కల్యాణ్ దృష్టి పెట్టడం లేదని, కనీసం ఇన్ ఛార్జులను కూడా నియమించడం లేదని, పదవులను అప్పగించడం లేదన్న విమర్శలను ఆయన పెద్దగా పట్టించుకోరు. లైట్ గానే తీసుకుంటారు. పార్టీ పదవి ఇచ్చిన తర్వాత నేతలు తనకు తెలియకుండా ఏదైనాఅవినీతి ఆరోపణలను ఎదుర్కొన్నా, మరేదైనా కేసులో ఇరుక్కుంటే తన పరువు ప్రజల్లో దెబ్బతింటుందని, అందుకే తక్కువ స్థానాల్లో పోటీ చేసి అయినా పూర్తి స్థాయి విజయం సాధించి అధికారంలోకి రావాలని ఆయన తొలి నుంచి ఆలోచనలో ఉన్నారు. అందులో భాగంగానే గత ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా పొత్తును ప్రకటించి కేవలం 21 నియోజకవర్గాల్లోనే పోటీ చేస్తామని ప్రకటించారు. అప్పుడు కూడా ఆయన విమర్శలు ఎదుర్కొన్నారు. 21 స్థానాలను తీసుకోవడమేంటని, జనసేన కారణంగానే కూటమి ఏర్పడిందని, అందువల్ల ఎక్కువ స్థానాలను తీసుకోవాలని పవన్ కల్యాణ్ పై పలువురు కామెంట్స్ చేసినా ఆయన పట్టించుకోలేదు. ఎమ్మెల్యేలు తక్కువగా ఉంటే వారిపై నిఘా పెట్టడంతో పాటు వారి పనితీరును ఎప్పటికప్పుడు గమనించవచ్చని, ఎక్కువ సంఖ్య అయ్యే కొద్దీ సమాచారం తెప్పించుకోవడం కూడా కష్టంగా మారుతుందని, టీడీపీ, వైసీపీలకు పోటీగా జనసేన కూడా తయారవ్వడం మినహా మరొకటి ఉండదని పవన్ కల్యాణ్ చంద్రబాబుపై పెద్దగా ఒత్తిడి తేకుండానే తనకు ఇచ్చిన సీట్లతోనే సరిపుచ్చుకుని వాటన్నింటిలో అభ్యర్థులను గెలిపించుకున్నారు- ఇక ఎమ్మెల్యేల సంగతి అలా ఉంచితే పార్టీ ఇన్ ఛార్జుల విషయంలోనూ చాలా ఆచితూచి వ్యవహరించేవారు. అలాంటిది శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి కోటా వినుత విషయంలో తప్పుడు సమాచారం అందించారని కొందరు నేతలపై పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వినుత హత్య కేసులో ఇరుక్కుని పార్టీ పరువును దిగజార్చారని, వైసీపీకి విమర్శించడానికి అవకాశాలు కల్పించినట్లయిందని కూడా పవన్ కల్యాణ్ నేతలపై మండి పడినట్లు తెలిసింది. ఇటువంటి వారికి పదవులు ఇచ్చి తప్పు చేశామని కూడా పవన్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. అందుకే పవన్ కల్యాణ్ ఇకపై పదవులు ఇచ్చే సమయంలోనూ ట్రాక్ రికార్డు చూసి మరీ ఇచ్చేందుకు మరింతగా అధ్యయనం చేయాలని నేతలకు సూచించినట్లు తెలిసింది.

# కేసులు మీద కేసులు

తిరుపతి, జూలై 14, ప్రభుత్వ అండదండలతో రెచ్చిపోతారా?! విచ్చలవిడిగా కేసులు పెడతారా?! మీరు మాపై కేసు మీద కేసు రాస్తే? మేం తప్పక ఇస్తాం రివర్స్ డోసు అంటున్నారు వైసీపీ నేతలు. చట్టబద్ధంకాని కేసులను చట్టబద్ధంగానే తేల్చుకుంటామంటూ సవాల్ చేస్తున్నారు. ప్రైవేట్ కేసులు వేసి ఓవైపు ప్రభుత్వం, మరోవైపు అధికారుల పని పడతామంటున్నారు?! అసలింతకీ ఈ ప్రైవేట్ కేసులంటే ఏంటి?? వాటి ఇంపాక్ట్ ఎలా ఉంటుంది?? ఇదే అంశం ఇప్పుడు రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.మాజీ సీఎం జగన్ వరుస పర్యటనలపై రాజకీయ రచ్చ ఏరేంజ్లో అయితే నడుస్తోందో? కేసులు కూడా అదే స్థాయిలో నమోదవుతున్నాయి?! అంతకుముందు గుంటూరు, మొన్నామధ్య పల్నాడు, లేటెస్ట్గా బంగారుపాళ్యం పర్యటనపైనా కేసులు ఫైల్ అవ్వడం చర్చనీయాంశమైంది. జగన్ పర్యటనలో వైసీపీ నేతలు, కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించడంతోపాటు పూర్తిగా ఆంక్షలు ఉల్లంఘిస్తున్నారంటూ కేసులు మీద కేసులు నమోదవుతున్నాయి. వైసీపీ కీలక నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలపైనా కేసులు ఫైల్ అయ్యాయి. అంతేకాదు పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనలో సింగయ్యను జగన్ కారు ఢీకొట్టిందంటూ జగన్పైనా కేసు నమోదవ్వడంపై భగ్గుమన్న వైసీపీ నేతలు రివర్స్ ఎటాక్కి రెడీ అయిపోయారు.సంబంధం లేని వాళ్లందరిపై కూటమి ప్రభుత్వం కేసులు పెడుతోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు? తప్పు ఎవరిదైనా తమ నేతలపైనే కేసులు పెడుతున్నారంటూ ఆగ్రహిస్తున్నారు. అలాంటి వాటికి వైసీపీలో భయపడే వాళ్లు ఎవరూ లేరంటూనే? ప్రైవేట్ కేసులతో ప్రభుత్వ పెద్దలు, ప్రభుత్వ అధికారుల పని పడతామంటున్నారు. ఇక కాస్కోండి అంటూ సవాల్ విసురుతున్నారు. తమపై కక్ష కట్టిన ఏ ఒక్కరిని వదలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.వైసీపీ నేతల మాటలతో అసలీ ప్రైవేట్ కేసులంటే ఏంటి?? అవి వేస్తే ఏమవుతుందన్న అంశంపై చర్చ మొదలైంది. ప్రైవేటు కేసు వేయడం అంటే? ఒక వ్యక్తి నేరుగా కోర్టులో దాఖలు చేసే ఫిర్యాదు. సాధారణంగా, పోలీసులు ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడానికి నిరాకరించినప్పుడు లేదా ఎలాంటి చర్యలు తీసుకోనప్పుడు బాధితులు నేరుగా కోర్టులో ప్రైవేటు కంప్లయింట్ దాఖలు చేస్తారు. ఆ తర్వాత ఫిర్యాదు చేసిన వ్యక్తి మేజిస్ట్రేట్ ముందు హాజరై తన ఇబ్బందులేంటో చెప్పాల్సి ఉంటుంది. ప్రభుత్వాధికారులు ఎందుకు కేసు ఫైల్ చేయలేదో క్లారిటీ కూడా ఇవ్వాలి.

# 'గ్రీన్ టీ' పరిమితి మించితే ఎన్నో సమస్యలు - వీరు దూరంగా ఉండాలి..!!



గ్రీన్ టీ. ఈ మధ్య కాలంలో బాగా వినియోగం పెరిగింది. గ్రీన్ టీ వలన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పరిశోధనలు తేల్చి చెప్పాయి. కాఫీ, టీకి ప్రత్యామ్నాయంగా అనేక మంది గ్రీన్ టీ వైపు మళ్లుతున్నారు. గ్రీన్ టీని పరిమితి మించి తాగితే అనేక సమస్యలు వస్తాయి. అదే విధంగా కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు గ్రీన్ టీకి దూరంగా ఉండటం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. గ్రీన్ టీ అధిత మోతాదులో తీసుకుంటే కాలేయానికి నష్టం చేస్తుందని పరిశోధనల్లో గుర్తించారు. కాలేయ సంబంధిత వ్యాధులు ఉన్న వారు గ్రీన్ టీ తాగే ముందు డాక్టర్?ను సంప్రదించాలని సలహా ఇస్తున్నారు. గ్రీన్ టీలో ఉండే టానిన్లు శరీరంలో యాసిడ్ స్థాయిలను పెంచుతాయని నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల వికారం, మలబద్ధకం, కడుపులో అసౌకర్యం, రక్తపోటు పెరగడం లాంటి సమస్యలు రావొచ్చని గ్రీన్ టీ అనేది ఐరన్ శోషణకు ఆటంకం కలిగించి.. మోతాదులో తీసుకోవడం వల్ల ఐరన్ లోపం రావడంతో పాటు అనీమియాకు దారితీస్తుందని చెబుతున్నారు. గ్రీన్ టీని అధికంగా తీసుకోవడం వల్ల కాల్షియం శోషణ తగ్గిపోయి ఎముకలు బలహీనపడవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రీన్ టీలో కెఫీన్ ఉంటుంది. గర్భిణులు అధిక మొత్తంలో కెఫీన్ తీసుకోవడం వల్ల కొన్ని అనేక అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. గర్భవతులు గ్రీన్ టీ తాగే ముందు సంబంధిత డాక్టర్లును సంప్రదించడం మంచిదని పేర్కొన్నారు. గ్రీన్ టీ కొన్ని రకాల మందులతో పరస్పర చర్యలు జరపవచ్చని పరిశోధనల్లో వెల్లడైంది. దీంతో, ఇలాంటి మందులు వాడుతున్నవారు గ్రీన్ టీ తాగే ముందు డాక్టర్ల సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఆరోగ్యంతో ఉన్నవారు కూడా రోజుకు 2-3 కప్పులు మించి గ్రీన్ టీ తీసుకోవద్దని సూచిస్తున్నారు. ఏమైనా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే లేదా కొత్తగా గ్రీన్ టీ తాగడం మొదలుపెట్టాలని అనుకునేవారు సంబంధిత డాక్టర్లును సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# నానబెట్టిన మెంతులు తింటే ఏం జరుగుతుందో తెలుసా..?



అరచేతిలో ఇమిడిపోయే చిన్న మెంతి గింజలు... కేవలం వంటకాలకు రుచిని మాత్రమే కాదు, మీ ఆరోగ్యానికి అద్భుతమైన సంపదను అందిస్తాయి. ముఖ్యంగా, వీటిని రాత్రంతా నానబెట్టి ఉదయం పరగడుపున తినడం వల్ల ఎన్నో అనూహ్యమైన ప్రయోజనాలను పొందవచ్చు. పూర్వకాలం నుండి ఆయుర్వేదంలో దీనికి ఉన్న ప్రాముఖ్యత అపారం. నానబెట్టిన మెంతులు జీర్ణవ్యవస్థకు ఒక వరం. వీటిలోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఉదయం పూట వీటిని తీసుకోవడం వల్ల ప్రేగు కదలికలు మెరుగుపడి, శరీరం నుండి విష పదార్థాలు బయటపడతాయి. ముఖ్యంగా, మధుమేహంతో బాధపడేవారికి ఇది ఒక దివ్య ఔషధం. మెంతులలో ఉండే సాల్యుబుల్ ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది, ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి మెంతులు ఒక అద్భుతమైన ఎంపిక. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలిగి, అనవసరమైన ఆహార కోరికలు తగ్గుతాయి. ఇది శరీరంలో మెటబాలిజంను వేగవంతం చేసి, కొవ్వును కరిగించడంలో తోడ్పడుతుంది. మహిళలకు అయితే, నానబెట్టిన మెంతులు రుతుక్రమ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి, పాలిచ్చే తల్లులకు పాలు ఉత్పత్తిని పెంచుతాయి. వీటిలోని ఐరన్ రక్తహీనతను నివారిస్తుంది. ఇలా ప్రాణాలు వదిలేయడం ఏంటి 5 జుట్టు రాలడాన్ని తగ్గించడంలో, జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో కూడా మెంతులు అద్భుతంగా పనిచేస్తాయి. అలాగే, చర్మాన్ని ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంచడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా మెంతుల పాత్ర గణనీయం. ప్రతిరోజూ ఉదయం చిన్న కప్పు నానబెట్టిన మెంతులను తీసుకోవడం ద్వారా మీ ఆరోగ్యంలో అద్భుతమైన మార్పులను గమనించవచ్చు. ఈ చిన్న గింజల శక్తిని తక్కువ అంచనా వేయకండి, మీ దైనందిన ఆహారంలో వీటిని భాగం చేసుకోండి, ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించండి!

# ట్రెండీ డైట్స్ లో కామన్ గా చేసే ఈ తప్పులే బరువు తగ్గకుండా చేస్తాయి!

ఊబకాయం ఇప్పుడు ప్రతి ఒక్కరిని ఇబ్బంది పెడుతున్న అతిపెద్ద సమస్య. అయితే చాలామంది బరువు తగ్గడానికి ట్రెండీ డైట్లను ఆశ్రయిస్తున్నారు. కానీ సాధారణ తప్పిదాలు బరువు తగ్గే ప్రక్రియకు అడ్డుగా నిలుస్తున్నాయి. అసలు ఈ ట్రెండీ డైట్ లను ఫాలో చేస్తున్న వారు చేస్తున్న తప్పిదాలు ఏమిటి? ఎందువల్ల బరువు తగ్గడంలో ఉన్నటువంటి ఆహార విధానం వీరికి సహకరించడం లేదు? అనేది ప్రస్తుతం తెలుసుకుందాం. డైటింగ్ చేసేవారు చేసే తప్పులివే చాలామంది డైటింగ్ చేస్తున్నాము అని చెబుతున్న క్రమంలో భాగంగా భోజనాన్ని స్కిప్ చేస్తూ ఉంటారు. ఇది శరీరంలో క్యాలరీలను తగ్గిస్తుందని నమ్ముతారు. కానీ అలా భోజనం స్కిప్ చేయడం వల్ల, మరోసారి భోజనం చేసినప్పుడు తెలియకుండానే అధిక మొత్తాన్ని ఆహారంలో తీసుకుంటారు. దీనివల్ల బరువు తగ్గడం జరగదు. ఒక క్రమ పద్ధతిలో భోజనాన్ని చేస్తే, క్రమ పద్ధతిలో వీటిని నిర్వహిస్తే బరువు తగ్గడానికి ఇవి దోహదం చేస్తాయి. ఇలా తింటే పోషకాహార లోపం.. బరువు నియంత్రణ ఎలా? చాలామంది డైటింగ్ పేరుతో ఇది తినకూడదు అది తినకూడదు అని, తక్కువ క్యాలరీలు ఉండే ఆహారాన్ని మాత్రమే ఎంపిక చేసుకొని తింటూ ఉంటారు. ఇలా తినడం పోషకాహార లోపానికి కారణమవుతుంది. శరీరానికి కావలసిన అన్ని పోషకాలు అందకపోవడం వల్ల శరీరం సరిగ్గా బరువును నిర్వహించడం జరగదు. దీనివల్ల ఇబ్బందిని ఎదుర్కోవలసి వస్తుంది. సప్లిమెంట్ లు, నీళ్ళు తాగకపోవటం బరువును తగ్గించవు కొంతమంది ఆహారాన్ని తినకుండా సప్లిమెంట్ల పైన ఎక్కువగా ఆధారపడతారు. సప్లిమెంట్లు పోషణకు సహాయపడినప్పటికీ అవి సహజ వనరుల నుండి లభించే మంచి ఆహారాన్ని, విటమిన్లు మరియు ఖనిజాలతో సమృద్ధిగా ఉండే ఆహారాన్ని అందించలేవు. ఇక డైటింగ్ చేస్తున్న చాలామంది సరిగ్గా నీళ్లు తాగకపోవడం కూడా ఒక సమస్య. శరీరం హైడ్రేటెడ్ గా ఉండడం మెటబాలిజం సరిగా పనిచేసేలా చేస్తుంది. డైటింగ్ మాత్రమే సరిపోదు అవి చెయ్యాల్సిందే తగినంత నీరు తాగడం ఆకలిని నియంత్రిస్తుంది. అంతేకాకుండా శరీర కార్యకలాపాలకు మద్దతు కూడా ఇస్తుంది. కాబట్టి సరిగా నీళ్లు తాగకపోయినా బరువు తగ్గాలనే ఆలోచన ఉన్న వారి కోరిక తీరదు. ఏ కొంతమంది డైటింగ్ మాత్రమే చేస్తూ మిగతా వాటి మీద ఫోకస్ చేయరు. శారీరక వ్యాయామం చేయడం, సరైన ఆహారపు నియమాలు పాటించడం, ఒత్తిడిని తగ్గించుకోవడం వంటి చర్యలు బరువు తగ్గడానికి దోహదం చేస్తాయి. ఎవరైతే వీటిని తూచా తప్పకుండా పాటిస్తారో వారు ఆరోగ్యకరంగా బరువు తగ్గడం ఖాయం.

# డార్క్ చాక్లెట్స్? తో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు– వీరికి మాత్రం..!!



డార్క్ చాక్లెట్స్. ఇతర చాక్లెట్స్ కంటే భిన్నమైనది. ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు అందిస్తుంది అని పరిశోధనలు తేల్చాయి. ఇందులో ఉండే కొకోవా.. ఫ్లేవనాయిడ్లు అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయంటున్నారు. ఈ యాంటీ ఆక్సిడెంట్లు అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయని చెబుతున్నాయి. అయితే, దీంతో చాలా రకాలైన ప్రయోజనాలు ఉన్నా.. దీర్ఘ కాలిక వ్యాధులకు మందులు తీసుకుంటున్న వారు మాత్రం వైద్యుల సూచనతోనే తీసుకోవాలి. డార్క్ చాక్లెట్లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఫ్రీ రాడికల్స్?ను తటస్థం చేయడం ద్వారా ఆక్సీకరణ ఒత్తిడిని ఎదుర్కోవడానికి సహాయపడతాయి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కణాలను దెబ్బతినకుండా రక్షిస్తాయని, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి దోహదం చేస్తాయి. డార్క్ చాక్లెట్ లో ఐరన్, మెగ్నీషియం, రాగి, మాంగ నీస్..ఫాస్పరస్ వంటి ముఖ్యమైన ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఎముకలు, దంతాలను ఆరోగ్ గా ఉంచడంతో పాటుగా నిద్రకు దోహదం చేయడానికి ఉపయోగపడతాయి. ఇందులోని ఫ్లేవనాయి హృదయ ఆరోగ్య ప్రయోజనాలతో ముడిపడి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ సమ్మేళ లు రక్తపోటును తగ్గించడానికి, రక్త ప్రసరణను మెరుగుపరచడానికి సహాయపడతాయి.”" ఇది చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతుందని, దీంతో గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదం తగ్గుతుందని చెబుతున్నారు. దీన్ని క్రమం తప్పకుండా తీసుకో డం వల్ల అల్జీమర్స్ వ్యాధి, పార్కిన్సన్స్ వ్యాధి వంటి ఇతర మెదడు సంబంధిత రుగ్మతల నుంచి కూడా రక్షణను అందిస్తుందని డార్క్ చాక్లెట్ ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతున్నారు. కొకోవా ని ఎపికాటెచిన్ అనే సమ్మేళనం శరీరం ఇన్సులిన్‌ను మరింత ప్రభావవంతంగా ఉపగించుకోవ నికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. డార్క్?చాక్లెట్ బరువు తగ్గడానికి సహాయపడు దని నిపుణులు చెబుతున్నారు.

# ఈ విషయాలు తెలిస్తే ఆరోగ్యానికి మిరియాలు చేసే మేలు మరచిపోలేరు




మిరియాలు, భారతీయ వంటకాలలో వినియోగించే ఒక మసాలా దినుసు. మిరియాలు సంప్రదాయ వైద్యంలో గణనీయమైన విలువను కలిగి ఉంది. దాని మసాలా రుచికి ప్రసి. మసాలా మాత్రమే కాదు, మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తున్న ఆరోగ్య ప్రదాయిని. శతాబ్దాలుగా ఉపయోగించబడుతున్న మిరియాలు జీర్ణక్రియకు సహాయపడుతుందని మరియు శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని నమ్ముతారు. దాని ప్రయోజనాలు ప్రాచీన భారతీయ వైద్య విధానం అయిన ఆయుర్వేదంలో చాలా గొప్పగా చెప్పారు. మిరియాలలో గొప్ప గుణాలు మిరియాలలో చాలా పోషకాలు ఉంటాయి. మిరియాలలో పొటాషియం, మెగ్నీషియం, ఐరన్, ఫైబర్, విటమిన్ సి, విటమిన్ కె వంటి పోషకాలు ఉంటాయి. మిరియాలలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఫంగల్, యాంటీ వితల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. మిరియాలతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు మిరియాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల మనకు జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఈ ప్రక్రియ ఉబ్బరం మరియు గ్యాస్ వంటి జీర్ణ సమస్యలను నివారించేందుకు దోహదం చేస్తుంది. మన జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మిరియాలు చేసే మేలు అంతా ఇంతా కాదు. మిరియాల లో పైపెరిన్ అనే క్రియాశీలకమైన సమ్మేళనం ఉంటుంది. దీనిని కలిగి ఉండడం వల్ల, శరీరంలో ఫ్రీ రాడికల్స్ వల్ల కణాలకు కలిగే నష్టాన్ని నివారిస్తుంది. మిరియాలతో ఈ సమస్యలకు చెక్ మిరియాల వలన శరీరంలో ఆక్సిడెంట్ ఒత్తిడి తగ్గుతుంది. శ్వాసకోశ సమస్యలను తగ్గిస్తుంది. దగ్గు జలుబు వంటి సమస్యలతో ఇబ్బంది పడేవారు వాటి నుండి ఉపశమనం కోసం మిరియాలను తీసుకోవచ్చు. మిరియాల లో ఉండే పైపెరిన్ కారణంగా ఫ్రీ రాడికల్స్ కారణంగా కణాలకు జరిగే నష్టాన్ని నివారించవచ్చు. మిరియాల లో క్యాన్సర్ కారక కణాలను నిరోధించే లక్షణాలు ఉన్నాయి.మిరియాలతో బరువు సమస్య నుండి ఉపశమనం నిత్యం మిరియాలను ఆహారంలో భాగం చేసుకోవటం వలన బరువు తగ్గటానికి కూడా ఇది దోహదం చేస్తుంది. మిరియాలు శరీరంలో ఉండే చెడు కొవ్వును తగ్గించి బరువు తగ్గిస్తుంది. మిరియాలు మనం తీసుకునే ఆహారానికి అదనపు విలువను చేకూర్చడం తో పాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కూడా ఇస్తాయి అయితే మిరియాలు ఇచ్చే ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వాటిని ఒక క్రమ పద్ధతిలో వినియోగించాలి కానీ, ఆరోగ్యం వస్తుందని ఇష్టారాజ్యంగా మిరియాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం మంచిది కాదు. ఇది అనవసరమైన అనర్ధాలకు కారణమవుతుంది.

# జస్ట్.. ఇవి తీసుకుంటే చాలు

మనం రోజూ తీసుకునే ఆహారంలో ఫైబర్ (పీచు) అత్యవసరం. జీర్ణ వ్యవస్థను సరిగ్గా పని చేయడంలో దీని పాత్ర ప్రధానం. నిజానికి- జీర్ణ వ్యవస్థ చాలా సున్నితంగా ఉంటుంది. ఏ మాత్రం తేడా కొట్టినా విరేచనాలు, లేదా మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. ఇర్రిటబుల్ బవెల్ సిండ్రోమ్ వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. ఫైబర్ జీర్ణ వ్యవస్థను సక్రమంగా ఉంచడంలో సహాయపడుతుంది. ప్రేగు కదలికలు, జీర్ణక్రియను మరింత క్రమబద్ధంగా చేస్తుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారం చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించగలదు. ముఖ్యంగా కరిగే ఫైబర్ ఉన్న ఆహారాలు తీసుకోవడం మంచిది. ఇవి ఇతర ఆహారాలలో తినే చెడు కొలెస్ట్రాల్‌ను శరీరం గ్రహించకుండా నిరోధిస్తుంది. ” కరిగే ఫైబర్ జీర్ణ శయాంతర ప్రేగులలోని కొలెస్ట్రాల్, పిత్త ఆమ్లాలతో కలిసిపోతుంది. రక్తంలో చక్కెరను మెరుగుపరుస్తుంది. మనం తినే ఆహారంలో పీచు అధికంగా ఉండటం శరీరానికి అత్యవసరం. దీనివల్ల జీర్ణం బాగా జరుగుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. బరువు, డయాబెటీస్, కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యం సైతం ఈ పీచు పదార్థాల వల్ల ఎంతగానో మెరుగుపడుతుంది. గుండెకు ఓ మెడిసిన్, ఓ టానిక్ లా ఇది ఉపయోగపడుతుందని, మరింత శక్తిని ఇచ్చినట్టవుతుందని డాక్టర్లు చెబుతుంటారు. డయాబెటీస్, క్యాన్సర్ ప్రమాదాల శాతాన్ని కూడా ఈ పీచు పదార్థాలు గణనీయంగా తగ్గించగలవు. ఫైబర్ అధికంగా ఉండే గింజలు- విత్తనాల జాబితాలో చియా సీడ్స్ టాప్ లో ఉంటాయి. ఓ వంద గ్రాముల చియా




సీడ్స్ లో 34 గ్రాముల వరకు ఫైబర్ ఉంటుంది. అలాగే ఫ్లాక్స్ సీడ్స్. ఇందులో 27 గ్రాముల వరకు పీచు మిళితమై ఉంటుంది. వంద గ్రాముల బాదంలో ఉండే పీచు.. 12 గ్రాములు.ఎ ఫైబర్ అధికంగా ఉండే ధాన్యాల జాబితాలో గోధుమ బ్రాన్ లో పీచు అధికంగా ఉంటుంది. 100 గ్రాముల గోధుమ బ్రాన్ లో పీచు 43 గ్రాముల వరకు ఉంటుంది. ఓట్స్- 10 గ్రాములు, మిల్లెట్లు (సజ్జలు-కొర్రలు), బ్రౌన్ రైస్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది. పండ్ల విషయాలకు వస్తే.. జామలో ఫైబర్ శాతం అధికంగా ఉంటుంది. అయిదు గ్రాముల వరకు పీచు ఇందులో ఉంటుంది. ఆపిల్ లో 4 గ్రాముల వరకు పీచు ఉంటుంది. నారింజ, అరటి, సీతాఫలం పండ్లల్లోనూ పీచు ఎక్కువ మోతాదులో ఉంటుంది. కూరగాయల్లో.. క్యారెట్, బెండకాయ, క్యాబేజీల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది.




# తమన్ స్టూడియోలో ప్రభాస్ సందడి

## రాజాసాబ్ సాంగ్స్ కంపోజింగ్‌పై ఆసక్తి




రెబల్ స్టార్ ప్రభాస్, మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'ది రాజా సాబ్'. హార్రర్, కామెడీ, రొమాంటిక్ కథాంశంతో రానున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధిలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరి బ్యానర్ పై విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. తాజాగా రెబల్ స్టార్ ప్రభాస్ తమన్ మ్యూజిక్ సిట్టింగ్స్ లో దిగిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే తమన్ అందించిన సాంగ్స్ ప్రభాస్ కు నచ్చలేదని అందుకే స్వయంగా డార్లింగ్ దిగాడని కెమెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్. వాస్తవానికి రాజాసాబ్ సినిమాకు తమన్ ఎప్పుడో సాంగ్స్ కంపోజ్ చేసి ఇచ్చేసాడు. అందులో కొన్ని సాంగ్స్ ను షూట్ కూడా చేసారు. ఆ తర్వాత స్క్రిప్ట్‌లో వచ్చిన కొన్ని మార్పుల కారణంగా ముందు కంపోజ్ చేసిన సాంగ్స్ అన్నిటిని పక్కన పెట్టేసారు. ఇప్పుడు మరలా తమన్ తో సాంగ్స్ ను కంపోజ్ చేపిస్తున్నారు. తమన్ అందుకోసం వర్క్ స్టార్ట్ చేసాడు. ఈ నేపథ్యంలోనే తమన్ స్టూడియోకు ప్రభాస్ వెళ్లి సరదాగా కాసేపు ఉండి వచ్చాడు. అంతే తప్ప వర్క్ నచ్చక కాదు. తమన్ సాంగ్స్ ఫినిష్ చేసాక సాంగ్స్ షూట్ చేసేందుకు షెడ్యూల్ ఎ÷–లాన్ చేస్తున్నారు మేకర్స్. తమన్ వర్క్ పట్ల మారుతీ చాలా అండ్ టీ–మ్ హ్యాపీ గా ఉన్నారు. జెట్ స్పీడ్ లో జరుగుతున్న రాజాసాబ్ ఈ ఏడాది డిసెంబర్ 5న థియేటర్స్ లో [illegible]

# రేణూదేశాయ్ సర్జరీ గురించి నెట్టింట ఆసక్తి



2009లో పవన్ కల్యాణ్‌ను ప్రేమ వివాహం చేసుకున్న రేణు దేశాయ్, అకీరా నందన్, ఆద్య అనే ఇద్దరు పిల్లలకు తల్లయ్యారు. 2012లో వీరి వివాహ బంధానికి బీటలు వారాయి.. విడాకుల అనంతరం రేణు సినిమాలకు కూడా దూరమయ్యారు. అప్పటినుంచి తల్లిగా తన పాత్రను పోషిస్తూ పిల్లలకే ప్రత్యేక సమయం కేటాయించారు. అయితే రేణూ దేశాయ్‌కి సంబంధించిన ఓ వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. రేణూ దేశాయ్ తాజాగా తన ఇన్‌స్టా స్టోరీలో కూతురు ఆద్యతో దిగిన పిక్ షేర్ చేస్తూ.. సర్జరీ తర్వాత నా ముద్దుల కూతురితో కలిసి డిన్నర్ డేట్‌కి బయటకు వెళ్లాను అంటూ క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఈ పోస్ట్ తర్వాత రేణూ దేశాయ్‌కి సర్జరీ జరగడమేంటి, ఆమెకు ఏమైందని ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఇక రేణూ దేశాయ్ దాదాపు 20 ఏళ్ల విరామం తర్వాత రవితేజ నటించిన 'టైగర్ నాగేశ్వరరావు' సినిమాలో నటించారు. హేమలత లవణం పాత్రలో కనిపించినా.. ఆ సినిమా ఫెయిల్ కావడంతో ఆమె మళ్లీ సినిమాలపై ఆసక్తి చూపడం లేదు. రేణు దేశాయ్ ఇప్పుడు జంతు హక్కుల కోసం పోరాడుతున్న ప్రముఖ సామాజిక కార్యకర్తగా మారారు. మూగజీవాల సంక్షేమానికి సొంతగా ఎన్జీవో కూడా ప్రారంభించారు. ఈ సంస్థకు ఉపాసన కొణిదెల అంబులెన్స్ సదుపాయం అందించడం విశేషం. ఇక ఇదిలా ఉంటే రేణ ఇటీవల రెండో పెళ్లిపై ఓపెన్ అయింది. అకీరా, ఆద్యే నన్ను పెళ్లి చేసుకోమని ప్రోత్సహిస్తున్నారు. నువ్వు ఎవరితో హ్యాపీగా ఉంటావో వాళ్లని పెళ్లి చేసుకో అంటున్నారు. మరో రెండేళ్లో నా పిల్లలకి పూర్తి అవగాహన వస్తుంది. అప్పుడు తప్పకుండా ఓ వ్యక్తిని పెళ్లి చేసుకుంటానని పేర్కొంది రేణూ.

# 18నుంచి అమెజాన్ ప్రైమ్‌లోకి కుబేర





శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర' ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా జులై 18 నుంచి స్ట్రీమింగ్ కానుంది. గత కొన్ని రోజులుగా దీని ఓటీటీ– విడుదలపై ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ.. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ అమెజాన్ ఓ పోస్టర్ విడుదల చేసింది. దేశంలోనే అత్యంత సంపన్నుడైన గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ సీఈవో నీరజ్ మిత్ర (జిమ్ సర్భ్) ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిలవాలని కలలు కంటుంటాడు. ఆ కల కోసం ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సాగర్ ప్రాజెక్ట్‌ను వినియోగించుకోవాలనుకుంటాడు. రూ.లక్ష కోట్ల డీల్ కుదుర్చుకుంటాడు. ఆ మొత్తం డబ్బులో రూ.50 వేల కోట్లు బ్లాక్‌లో.. మిగిలిన డబ్బు వైట్‌లో ఇవ్వాలని నీరజ్‌కు సిద్ధప్ప షరతు విధిస్తాడు. ఈ పనిని సమర్థంగా చేయడం కోసం జైల్లో ఉన్న మాజీ సీబీఐ అధికారి దీపక్ తేజ్ (నాగార్జు)ను బయటకు తీసుకొస్తాడు. ఈ పని కోసం దీపక్ బిచ్చగాళ్లను ఎంచుకుంటాడు. ఈ పని పూర్తి కాగానే ఆ నలుగురు బిచ్చగాళ్లను చంపేయాలని నీరజ్ ప్లాన్ చేయగా.. వారిలో ఒకడైన దేవా (ధనుష్) తప్పించుకుంటాడు. మరి వీళ్ల చేతికి దేవా దొరికాడా? తన ఖాతాలో ఉన్న వేల కోట్ల డబ్బును దేవా ఏం చేశాడన్నది మిగిలిన కథ. శేఖర్ కమ్ముల మూవీ కావడంతో ఆసక్తి పెరిగింది. అయితేఅనుకున్నంతగా ఇది సక్సెస్ సాధించలేదన్నది వేరు విషయం.

# రామాయణలో నుమంతుడిగా సన్నీ డియోల్

## తొలి భాగంలో కేవలం 15 నిముషాలు మాత్రమే

బాలీవుడ్ డైరెక్టర్ నితీశ్ తివారి రామాయణాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకుతీసుకురానున్న విషయం తెలిసిందే. 'రామాయణ' పేరుతో ప్రతిష్ఠాత్మకంగా ఇది రూపొందుతోంది. ఇటీవల ఇందులోని పాత్రలను పరిచయం చేస్తూ వీడియోను విడుదల చేయగా దానికి మంచి ఆదరణ లభించింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో హనుమంతుడి పాత్రలో బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ కనిపించనున్నట్లు– టీమ్ అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. రెండు పార్టులుగా రానున్న ఈ సినిమా మొదటిభాగంలో ఆయన పాత్ర నిడివి చాలా తక్కువగా ఉ ఒడనున్నట్లు– సమాచారం. 15 నిమిషాలు మాత్రమే కనిపిస్తారట. రెండో భాగంలో ఆయన పాత్రే కీలకం కానున్నట్లు తెలుస్తోంది. పార్ట్ 2లో ఎక్కువసేపు కనిపించనున్నారట. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ ఈ వార్త మాత్రం సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి , రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు– తెలుస్తోంది.



# పెళ్లంటే జీవితకాలపు బాధ్యత

## నటి శృతిహాసన్ ఆసక్తికర విషయాలు వెల్లడి

తన వ్యక్తిగత విషయాల గురించి ఎప్పుడూ అభిమానులతో పంచుకునే నటి శ్రుతి హాసన్ పెళ్లి విషయంలోనూ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. పెళ్లిపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. వివాహం అనే ఆలోచన కూడా తనకు భయాన్ని కలిగిస్తుందన్నారు. నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి జీవితమంతా కష్టపడ్డాను. ఆ గుర్తింపును ఓ కాగితం ముక్కతో ముడిపెట్టాలనే ఆలోచన కూడా భయంకరంగా అనిపిస్తుంటుంది. వివాహ బంధాన్ని.. ఆ వ్యవస్థలో ఉన్న విలువలను నేను గౌరవిస్తాను. కానీ, వాటిని ధ్రువీకరించడానికి ఓ చట్టపరమైన కాగితం అవసరం లేదని నా అభిప్రాయం. నా జీవితంలో ఒకసారి నేను వివాహానికి చాలా దగ్గరగా వెళ్లాను. కానీ, అది ముడి పడలేదు. ఇద్దరు మనుషులు ఒక్కటవ్వాలంటే వారి అభిప్రాయాలు కలవాలి. అయినా, పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన విషయం కాదు. అది జీవితకాలపు బాధ్యతని అన్నారు. మరికొన్ని రోజుల్లో 'కూలీ'తో పలకరించనున్న ఆమె.. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడించారు. రజనీకాంత్‌తో కలిసి వర్క్ చేసిన అనుభవంతో పాటు తన కెరీర్ గురించి మాట్లాడారు. పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన 'గబ్బర్ సింగ్'లో అవకాశం వచ్చినప్పుడు కొన్ని కారణాల వల్ల నేను నటించలేనని చెప్పాను. హరీశ్ శంకర్ నన్ను ఒప్పించారు. ఆ పాత్రలో నన్ను కాకుండా మరో నటిని ఊహించుకోలేనన్నారు. కానీ, ఆ సినిమా నా కెరీర్ మొత్తాన్ని మార్చేసింది. నేను నటించిన ఎన్నో సినిమాలు మంచి సక్సెస్‌ను సాధించినప్పటికీ తొలి విజయాన్ని ఇచ్చింది మాత్రం తెలుగు పరిశ్రమే.



పవన్ ఎప్పుడూ వ్యవసాయం గురించి, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారి గురించే మాట్లాడుతుండేవారు. ఆయనకు రాజకీయ రంగం కూడా సరిపోతుంది.మా నాన్న, రజనీకాంత్ ఇద్దరూ తమిళ ఇండస్ట్రీక్రి రెండు కళ్ల లాంటి వాళ్లు. రజనీకాంత్ సూపర్ స్టార్. ఇన్ని రోజులు మా నాన్న దృష్టికోణంలోనే ఆయన నాకు తెలుసు. 'కూలీ' సినిమాలో ఆయనతో వర్క్ చేస్తున్నప్పుడు పూర్తిగా తెలుసుకున్నాను. సెట్‌లో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. తన చుట్టూ ఉండేవాళ్లు కూడా సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. ఆయన ఎనర్జీకి ఎవరూ సరితూగరు. ఆయనతో కలిసి నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇండస్ట్రీలో ఎంతోమంది గొప్ప నటులు ఉన్నారు. ఎవరి ప్రత్యేకతలు వారికి ఉంటాయి. అమితాబ్ బచ్చన్ , కమల్ హాసన్, రజనీకాంత్.. వీరందరినీ ఒకరితో ఒకరిని పోల్చలేం అని శ్రుతి వివరించారు.

## రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే ప్రారంభించాలి : మల్లం మహేశ్




నిడమనూరు, జూలై 14 : నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తక్షణమే ప్రారంభించాలని డీవైఎఫ్ఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి మల్లం మహేశ్ డిమాండ్ చేశారు. సోమవారం నిడమనూరు మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకం ద్వారా నిరుద్యోగులకు అండగా ఉంటామని ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పటివరకు నిధులు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకానికి తక్షణమే నిధులు కేటాయించి నిరుద్యోగులను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు జిల్లా నాయకులు మల్లికంటి చంద్రశేఖర్, ధర్మారపు మధు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ.. ఇద్దరికీ తీవ్ర గాయాలు



కారేపల్లి, జూలై 14 : ప్రయాణికులను దింపేందుకు ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనడంతో ఇద్దరు ప్రయాణికులతో పాటు ఆర్టీసీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం వైపు నుండి ఇల్లెందు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కామేపల్లి స్టేజీలో ప్రయాణికులను దింపేందుకు ఆగింది. దీంతో వెనుక నుండి వేగంగా వస్తున్న యాష్ లారీ అదుపుతప్పి ముందున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ అంజితో పాటు ప్రయాణికులు రమాదేవి, శ్రీవిద్య భూక్యశౌర్య, సీతకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ప్రమాద స్థలానికి చేరుకున్న కామేపల్లి, కారేపల్లి పోలీసులు క్షతగాత్రులను 108 సహాయంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 47 మంది ప్రయాణికులు ఉన్నట్లు కండక్టర్ బి.ఉపేందర్ తెలిపారు. లారీ డ్రైవర్ ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జాతీయ క్రీడా బిల్లు: మంత్రి మాండవీయ



న్యూఢిల్లీ: రాబోయే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో.. జాతీయ క్రీడా పరిపాలన బిలును ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సూక్ మాండవీయ తెలిపారు. జూలై 21వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభంకానున్న విషయం తెలిసిందే. ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బహుళ దేశాలు పాల్గొనే ఈవెంట్లలో భాగంగా ఇండియాలో జరిగే టోర్నీలకు వచ్చే పాకిస్థాన్ అథ్లెట్లను అడ్డుకోబోమని ఆయన స్పష్టం చేశారు. క్రీడా బిల్లుకు సంబంధించిన సమగ్రమైన వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు నిధుల అంశాన్ని ఆ బిల్లులో ప్రస్తావించనున్నట్లు చెప్పారు. క్రీడా నిర్వహణదారుల కోసం రెగ్యులేటరీ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అత్యున్నతమైన పరిపాలనా, ఆర్థిక, నైతిక ప్రమాణాలు పాటించే రీతిలో ఆ బోర్డు వ్యవహరించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పాకిస్థాన్‌తో సంబంధాలు సరైన రీతిలో లేకున్నా.. భారత్‌కు వచ్చే ఆ దేశ క్రీడాకారుల్ని అడ్డుకోబోమన్నారు.

## 17 రోజుల్లో 30 పుణ్యక్షేత్రాలు

హైదరాబాద్ జూలై 14, దేశంలో ఎన్నో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వీటిని లైఫ్‌లో ఒక్కసారైనా కూడా చూడాలని భావిస్తారు. అయితే ఒక్కో పుణ్యక్షేత్రానికి వెళ్లడానికి కష్టం. అన్నింటిని కూడా ఒక ట్రిప్‌లో పూర్తి చేయాలని అనుకుంటారు. ముఖ్యంగా ప్రముఖ పుణ్య క్షేత్రాలైన అయోధ్యతో పాటు దాని చుట్టూ ఉన్న ఆలయాలను సందర్శించాలని భావిస్తారు. అలాంటి వారికి ఐఆర్‌సీటీసీ బెస్ట్ ప్యాకేజీని అందిస్తోంది. ఈ ప్యాకేజీలో మొత్తం 17 రోజుల్లో 30 పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చు. ఈ యాత్ర జులై 25వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ టూర్‌లో అయోధ్యతో పాటు వారణాసి, ప్రయాగ్‌రాజ్, నాసిక్, రామేశ్వరం వరకు ఈ టూర్ ఉంటుంది. మొత్తం 150 మంది ప్రయాణికులతో భారత్ గౌరవ్ డీలక్స్ ఏసీ టూరిస్ట్ ట్రైన్‌లో యాత్రకు తీసుకెళ్తారు.

## ప్రభుత్వ సేవల గురించి అర్జీదారులకు అర్థమయ్యే భాషలో బొమ్మలు, వీడియోలు రూపొందించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్

అనంతపురం(విజయ సారథి):వివిధ రకాల రెవెన్యూ, ఇతర ప్రభుత్వ సేవల గురించి పిజిఆర్ఎస్ ద్వారా అర్జీలను అందించే అర్జీదారులకు అర్థమయ్యే భాషలో బొమ్మలు, వీడియోలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టరేట్



కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులకు వివిధ రకాల రెవెన్యూ, ఇతర ప్రభుత్వ సేవలు గురించి సరైన విధంగా అర్థమయ్యేటట్లు బొమ్మలు గీయాలన్నారు. స్థానిక భాషలోనే అర్థమయ్యే విధంగా వీడియోలు రూపొందించాలన్నారు. సబ్ డివిజన్ అంటే ఏమిటి, చుక్కల భూమి, మ్యుటేషన్, ఆర్ఓఆర్ కోర్టులు, మిగులు భూమి అంటే ఏమిటి, సరిహద్దులు చూపించడం, భూమి ఆక్రమణ, జాయింట్ ఎల్పీఎంలు, రీసర్వేలో విస్తీర్ణం తగ్గడం, అలైన్మెంట్, వెబ్లాండ్ కరెక్షన్, ఇళ్ల పట్టా, తదితర అంశాలపై పూర్తిగా అవగాహన కలిగేలా బొమ్మలను గీయాలని, వీడియోలు రూపొందించాలని సూచించారు. అర్జీదారులకు ఏ విధంగా చెప్తే అర్థమవుతుంది, వారు అర్థం చేసుకోగలుగుతారు అనేది తెలియజేసేలా వాటిని తయారు చేయాలన్నారు. కలెక్టరేట్లో ఏముంది, తహసిల్దార్, ఆర్డీవో, జెసి కోర్టులు అంటే ఏమిటి అనేదానిపై కూడా వీడియోలు రూపొందించాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే, క్షేత్రస్థాయి, ఇతర అధికారులకు ఉపయోగపడే విధంగా వీడియోలు ఉండాలన్నారు. దీని ద్వారా అర్జీదారులకు ప్రభుత్వ సేవల గురించి అర్థమయ్యే విధంగా తెలియజేసేందుకు అవకాశం ఉంటుందని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారం తక్కువగా ఉందని, ఇందుకు కారణం తెలుసుకోవాలని, సచివాలయ మానిటర్ సిస్టం మరింత బలోపతం చేయాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మాలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పే నాయక్, రామ్మోహన్, మల్లికార్జున, ఆనంద్, సిపిఓ అశోక్ కుమార్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, పిజిఆర్ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, కమాండ్ కంట్రోల్ రూమ్, పిజిఆర్ఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్ల నిర్ణయం ప్రభుత్వం విరమించుకోవాలి

### సిపిఎం మండల కార్యదర్శి హెచ్ జయరాజు

మంత్రాలయం(విజయ సారథి):మంత్రాలయం విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను బిగించే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం డి అంజిబాబు మండల కార్యదర్శి హెచ్ జయరాజు కోరారు. సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం డి అంజిబాబు ఆదేశాల మేరకు స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో మేరకు విద్యుత్ శాఖ ఏ.ఈ. కార్యాలయం వద్ద స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళన వ్యక్త చేసి డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని ఆ శాఖ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను బిగించడం వల్ల ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలు పడతాయని తెలిపారు. భవిష్యత్తులో సెల్ ఫోన్ కు, టీవీలకు రీఛార్జి చేసుకునే విధానంతో విద్యుత్తుకు కూడా రీఛార్జి చేసుకునే విధానం వస్తుందని దీనివల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని అన్నారు. విద్యుత్తు డిమాండ్ ను బట్టి కరెంటు చార్జీలు వసూలు చేస్తారని చెప్పారు. ఎండాకాలంలో ఒక రకంగాను చలికాలంలో ఒక కరకంగాను విద్యుత్ చార్జీలు వసూలు



చేసే విధానం వస్తుందన్నారు. రాత్రి ఒక రకమైన చార్జీలు పగలు ఒక రకమైన చార్జీలు వసూలు చేస్తారని పేర్కొన్నారు. అధికారంలోకి రాకముందు జగన్మోహన్ రెడ్డి స్మార్ట్ మీటర్ల ఒప్పందం చేసుకున్న సందర్భంగా దాన్ని వ్యతిరేకించిన టిడిపి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని కొనసాగించడం సిగ్గుచేటన్నారు. అదాని లాంటి బడా పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చడం కోసమే స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. ప్రస్తుతం బిగిస్తున్న స్మార్ట్ మీటర్లు ఉచితమని ప్రచారం జరుగుతున్నప్పటికీ 93 వాయిదాలతో కరెంట్ బిల్లుతో కలిపి వసూలు చేసే విధానాన్ని కొనసాగించే అవకాశం ఉందని తెలిపారు. ఒక్కొక్క వినియోగదారుని దగ్గర నుండి సుమారు 9 వేల వేల రూపాయలు, 17వేల రూపాయలు వసూలు చేస్తారని అన్నారు. ప్రజలకు నష్టదాయకమైన స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని లేనిపక్షంలో గత 2000 సంవత్సరంలో ఏ రకంగా విద్యుత్తు ఉద్యమం జరిగిందో అలాంటి ఉద్యమాన్ని వామ పక్షాలు నిర్వహిస్తాయని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు ప్రాణేష్ ఆంధ్రయ లక్ష్మన్న సురేష్ ప్రసంగి దేవా వీరేష్ దేవరాజు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## బోయింగ్‌ను కాపాడేందుకు ట్రంప్ సర్కారు ప్రయత్నం..!

బోయింగ్ విమానాల్లోని ఇంధన స్విచ్ లాక్‌లు సురక్షితంగా ఉన్నాయని యూఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్, బోయింగ్ కంపెనీ పేర్కొన్నాయి. అయితే, ఎయిర్ ఇండియా విమానంలో స్విచ్‌లు ఆఫ్ కావడం వల్లనే ప్రమాదం జరిగి ఉండవచ్చని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, నివేదికను యూఎస్ ప్రభుత్వం వాదనలు తిరస్కరించిన నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం పైలట్లనే బాధ్యతలను చేస్తూ.. బోయింగ్ కంపెనీని కాపాడేందుకే ప్రయత్నిస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఈంం) పౌర విమానయాన అధికారులకు పంపిన నోటిఫికేషన్‌లో 'ఇంధన నియంత్రణ స్విచ్ రూపకల్పనలో లాకింగ్ ఫీచర్ ఉంటుంది. వివిధ బోయింగ్ విమానాల్లో ఒకే విధంగా ఉంటుంది. బోయింగ్ 787 విమానంతో సహా ఏ ఇతర మోడల్ విమానాలకు ఎయిర్‌వర్తినెస్ డైరెక్టివ్‌ను వర్తింపజేయాల్సిన అవసరం లేదు' అని పేర్కొంది. ఎయిర్‌వర్తినెస్ డైరెక్టివ్ (ంఆ) అనేది విమానం,



ఇంజిన్, ప్రొపెల్లర్, ఇతర భాగంలో కనిపించే ఏవైనా అసురక్షిత పరిస్థితులను సరిచేయడానికి ఏవియేషన్ అధికారులు జారీ చేసిన చట్టబద్ధంగా అమలు చేయగల పత్రం. విమానాల సురక్షిత ఆపరేషన్ కోసం ఈ మార్గదర్శకాలు కీలకం. ఎయిర్ ఇండియా విమానం బ్లాక్ బాక్స్ దర్యాప్తులో విమానం చివరి క్షణాల్లో కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో ఒక పైలట్ మరొక పైలట్ ఇంధన స్విచ్‌ను ఎందుకు ఆఫ్ చేశావని అడిగిట్లుగా రికార్డయ్యింది. దీనికి మరో పైలట్ స్పందిస్తూ తాను ఆఫ్ చేయలేదని సమాధానం ఇచ్చారు. టేకాఫ్ అయిన వెంటనే ఇంధన స్విచ్‌లను కటాఫ్‌కు మార్చారని, దాంతో విమానం ఇంజిన్‌లకు ఇంధన సరఫరా ఆగిపోయిందని దర్యాప్తులో నివేదికలో పేర్కొన్నారు. పైలట్లు మళ్లీ ఇంధన స్విచ్‌ను ఆన్ చేసే సమయానికి బహుశా చాలా ఆలస్యమై ఉండవచ్చని వేదిక పేర్కొంది. దాంతో బోయింగ్ విమానాల ఫ్యూయల్ స్విచ్‌ల పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాంకేతిక లోపం కారణంగా ఇంధన స్విచ్‌లు నిలిచిపోతే ఎలా? అన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఎఫ్ఎఫ్ వీటిని తోసిపుచ్చింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై భారత ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ంంఎః) తన ప్రాథమిక నివేదికలో 2018లో యూఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఈంం) జారీ చేసిన మార్గదర్శకాలను ప్రస్తావించింది. ఇది 787తో సహా బోయింగ్ కంపెనీకి చెందిన వివిధ మోడల్ విమానాలలో ఇంధన స్విచ్ లాకింగ్‌ను తనిఖీ చేయాలని సిఫార్సు చేసింది. ఎఫ్ఏఏ మార్గదర్శకాలు తప్పనిసరి కానందున ప్రమాదానికి గురైన ఎయిర్ ఇండియా విమానంలో ఇంధన స్విచ్ లాకింగ్‌ను తనిఖీ చేయలేదని దర్యాప్తులో తేలింది. భారతీయ పైలట్స్ అసోసియేషన్ అల్పా (ంఙం) ప్రమాదంలో పైలట్ల వల్ల తప్పిదం జరిగిందనే వాదనలను తిరస్కరించింది. ఈ విషయంలో పారదర్శకంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. ఈ దర్యాప్తులో పరిశీలకులుగా పైలట్లను సైతం చేయాలని కోరింది.

## కలెక్టర్‌ను కలిసిన నగరపాలక నూతన కమిషనర్




కర్నూలు(విజయ సారథి):జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషను నగరపాలక నూతన కమిషనర్ పి.విశ్వనాథ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, కలెక్టర్‌కు కమిషనర్ పుష్పగుచ్ఛం ఇచ్చి, నగరాభివృద్ధిపై చర్చించారు.

## అలనాటి నటి బి సరోజాదేవి కన్నుమూత



బెంగళూరుజూలై 14, అలనాడి ప్రముఖ నటి బి.సరోజాదేవి సోమవారం ఉదయం బెంగళూరులోని తన నివాసంలో కన్నుమూశారు. ఆమె వయసు 87 సంవత్సరాలు. తన పదమూడేళ్ల వయసులోనే ఆమె చిత్రపరిశ్రమలో ప్రవేశించారు. దాదాపు 200 లకు పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. సరోజాదేవి చిన్నతనంలోనే శాస్త్రీయ సంగీతం, నృత్యం నేర్చుకున్నారు. తెలుగు, తమిళం, కన్నడ భాషలలో అనేక హిట్ చిత్రాల్లో నటించిన సరోజాదేవి ఎన్టీఆర్, ఏఎన్ఆర్, ఎంజీఆర్లతో కలిసి నటించారు. 1969లో భారత ప్రభుత్వం ఆమెను పద్మశ్రీతో సత్కరించింది. 1992లో పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. ఆమె మృతిపట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు.

## మా పనుల బిల్లును చెల్లించండిస

### మన ఊరు- మన బడి కాంట్రాక్టర్లు

హైదరాబాద్ జూలై 14,మన ఊరు - మన బడి పథకములో ప్రభుత్వ పాఠశాలలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వలేదని మన ఊరు- మన బడి కాంట్రాక్టర్లు వాపోయారు. సోమవారం నాడు పాఠశాల విద్యా కమిసనర్ కార్యాయలం ముందు నిరసనకు దిగారు. నిరసనకారులు మాట్లటాడుతూ గత ప్రభుత్వ హయాములో 2022-23 విద్యా సంవత్సరములో మన ఊరు - మన బడి పథకము కింద, పలు రకాల అభివృద్ధి పనులు చేసాం. అదనపు తరగతి గదులు, మరుగు దొడ్లు, భోజన శాలలు, ప్రహరీ గోడలు, మంచినీటి సంపులు నిర్మించి తదితర అభివృద్ధి పనులు చేపట్టాము. రాష్ట్ర వ్యాప్తంగా చిన్న, చితక కంట్రాక్టర్ల మైన మేము వందల సంఖ్యలో పాఠశాలలను అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టాము. చేపట్టిన పనులు వివరాలను ఇంజనీరింగ్ అధికారులు మెజర్ మెంట్ బుక్ (ఓ.ః) లలో రికార్డ్ చేసి ఆన్లైన్ లో నమోదు చేశారు. ఈ ప్రభుత్వం గత రెండు సంవత్సరాల నుండి బల్లలు ఇవ్వరపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు బిల్లులు రాకపోవడంతో, ఆర్థిక భారంతో ఆత్మహత్యలు చేసుకున్నారు. నిలిచి పోయిన బిల్లులను ప్రభుత్వం ద్వారా ఇప్పించాలని కోరారు.

## మహిళా కమిషన్ ముందు జాగృతి నిరసన

సికింద్రాబాద్.. జూలై 14,ఇటీవల ఎమ్మెల్సీ కవిత పట్ల తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యల నేపద్యంలో తెలంగాణ జాగృతి విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ మహిళా కమిషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తీన్మార్ మల్లన్న పై కెసు నమోదు చేసి అరెస్ట్ చేసే వరకు ఇక్కడి నుండి కదలమని హెచ్చరిస్తున్న మహిళలు. చైర్ పర్సన్ నేరెళ్ల శారద ను కలిసి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ కవిత పట్ల తీన్మార్ మల్లన్న చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై మండిపడ్డారు. తెలంగాణలో మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని అన్నారు. తెలంగాణ ఆడపడుచులను, మహిళలను అవమానించే విధంగా తీన్మార్ మల్లన్న మాట్లాడిన మాటలు తెలంగాణ మహిళా సమాజాన్ని కంటతడి పెట్టించినట్లు తెలిపారు. తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో తగిన గుణపాఠం చెబుదామని హెచ్చరించారు.

## కుత్బుల్లాపూర్‌లో కల్తీ కల్లు కలకలం.. దంపతులకు అస్వస్థత..!

కుత్బుల్లాపూర్/జీడిమెట్ల, జూలై 14 : నగరంలో కల్తీ కల్లు పంజా విసురుతుంది. ఇటీవల కూకట్‌పల్లి, బాలానగర్ పరిధిలో కల్లు కాంపౌండ్ లో కల్తీ కల్లు కాటేసింది. ఇది మరువక ముందే కుత్బుల్లాపూర్‌లో కల్లు కాంపౌండ్‌లో కల్లు సేవించిన ఓ ఇద్దరు దంపతులు అస్వస్థతకు గురి కావడంతో కలకలం రేపింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా భూపాల్ మండలం మంచి గ్రామానికి చెందిన ధరావత్ లచ్చిరాం (50), సాక్రిభాయ్(45) దంపతులతోపాటు కుమారుడు నిశాంత్‌లు గత ఆరు నెలల కిందట నగరానికి వలస వచ్చి సుభాష్ నగర్ డివిజన్ రామ్ రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరు ముగ్గురు జీడిమెట్ల పారిశ్రామిక వాడలో పలు కంపెనీలలో రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం కుమారుడు నిశాంత్ రామ్ రెడ్డి నగర్, షాపూర్ నగర్ ప్రాంతాల్లో ఉన్న కల్లు కాంపౌండ్‌ల నుండి కల్లు ప్యాకెట్లను పార్సిల్ చేసి ఇంటికి తీసుకెళ్లాడు.

# ధరల పట్టికను ప్రదర్శించని ప్రైవేట్ ల్యాబ్ లు, ఆసుపత్రులపై తప్పక చర్యలు

కడప(విజయ సారథి):జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు,ల్యాబ్ లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, క్లినిక్ లు నిర్వహించుచున్న యాజమాన్యం వారు ధరల పట్టికను తెలుగులో మరియు ఇంగ్లీషులో అందరికీ కనిపించే విధముగా ప్రదర్శించవలయునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు గారు తెలియజేశారు. పరీక్షలు మరియు వైద్య సేవలకు సంబంధించిన ఫీజుల గురించి ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియచేసి, రోగులు కట్టిన డబ్బులకు రసీదులు తప్పనిసరిగా వారికి ఇవ్వవలయునని, రోగులకు సంబంధించిన రికార్డులను మెయింటెనెన్స్ చేయవలెనని తెలిపారు. ధరల పట్టికలో చూపించిన దాని కంటే ఎక్కువ రుసుము కట్టించుకున్నట్లు ప్రజల నుండి ఫిర్యాదులు రావడం మరియు ఆసుపత్రులలో గాని ల్యాబ్ లలో గాని ధరల పట్టిక ప్రదర్శనలో లేనియెడల అటువంటి యాజమాన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## ఈ నెల 16 నుంచి 19 వరకు జిల్లాలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన




విశాఖపట్టణం(విజయ సారథి)ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ విశాఖపట్టణం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో బుధవారం (16వ తేదీ) సాయంత్రం 7.30 గంటలకు రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గం ద్వారా నగరానికి చేరుకుంటారు. రాత్రికి స్థానిక హెచ్పీసీఎల్ అతిథి గృహంలో బస చేస్తారు. గురువారం (17వ తేదీ) ఉదయం 11.00 గంటలకు మిందిలోని బీహెచ్ఈఎల్ ప్లాంటను సందర్శించి అక్కడి సీనియర్ అధికారులతో సమావేశమవుతారు. ఆ రోజు సాయంత్రం అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కలిసి కలెక్టరేట్లో వివిధ అంశాలపై సమీక్షించే నిమిత్తం సమావేశం నిర్వహిస్తారు. శుక్రవారం (18వ తేదీ) ఉదయం 10.30 గంటలకు హెచ్పీసీఎల్ రిఫైనరీ ప్లాంట్ ను సందర్శించి అక్కడి సీనియర్ అధికారులతో సమావేశమవుతారు. అదే రోజు సాయంత్రం 3.00 గంటలకు స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్, సీపీలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఆయనతో పాటు పీఎస్ క్రాంతి కుమార్, డైరెక్టర్ డా. సునీల్ కుమార్ బాబు, రీసెర్చ్ ఆఫీసర్ డి. వరప్రసాద్, పర్సనల్ అసిస్టెంట్ ఆఫ్ స్టేట్ ఆఫీస్, హైదరాబాద్ చొక్కాం నవీన్ కుమార్ తదితరులు పర్యటించనున్నారు. పర్యటన, స్థానిక కార్యక్రమాల అనంతరం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు 19వ తేదీ రాత్రికి వాయుమార్గం ద్వారా ఢిల్లీ చేరుకుంటారు. ఈ మేరకు జిల్లా ప్రొటోకాల్ విభాగానికి అధికారిక సమాచారం అందింది.

# పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి !

## డిఆర్వో యం. విశ్వేశ్వర నాయుడు

కడప(విజయ సారథి):జిల్లాలోని 7 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఏపిపిఎస్సి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి యం. విశ్వేశ్వర నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లో డిఆర్వో గారి ఛాంబర్లో.. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే క్రింద తెలిపిన నోటిఫికేషన్ సంబందించిన పరీక్షల నిర్వహణపై డిఆర్వో యం. విశ్వేశ్వర నాయుడు ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారులైన పర్యవేక్షకులు యాన్. అంజమ్మ(సెక్షన్ ఆఫీసర్) మరియు పి. పద్మ ప్రియ(సెక్షన్ ఆఫీసర్)లతో కలిసి పరీక్షల విధులు కేటాయించిన 07 మంది లైజెన్ ఆఫీసర్లు, 07 మంది చీఫ్ సూపరింటెండెంట్లతో మరియు పోలీస్, మెడికల్, విద్యుత్ శాఖదికరులతో కలిసి సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ సంఖ్య, విడుదల తేదీ, పోస్టుల వివరాలు క్రింద తెలిపిన ప్రకారం.ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో పై నోటిఫికేషన్ సంబందించిన పోస్టుల భర్తీ కోసం.. ఈ నెల 15 మరియు 23వ తేది వరకు ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మరియు మధ్యాహ్నం 02.30 గంటల నుంచి సాయంత్రం 05.00 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షలను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా చూడాలని సూచించారు.పోలీసు శాఖ ప్రతి సెంటర్లో బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు, వారి వెంట వచ్చే వారికి ఎలాంటి కొరత లేకుండా ఆయా పరీక్ష కేంద్రాల యాజమాన్యాలు అన్ని వసతులను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు.



# ఫిర్యాదుదారుతో అధికారులు నేరుగా మాట్లాడి సమస్యను పరిష్కరించాలి

## పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాలు

## సోమవారం పీజీఆర్ఎస్ లో వివిధ సమస్యలపై 348 వినతులు అందించిన ప్రజలు

విశాఖపట్టణం(విజయ సారథి):సమస్యలపై వినతి పత్రం అందించిన ఫిర్యాదుదారుతో సంబంధిత విభాగ అధికారి లేదా ఉద్యోగి తప్పకుండా ఫోన్లో సంప్రదించాలని, సంతృప్తికర రీతిలో సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఆయా విభాగాల అధికారులు ఫిర్యాదుదారుతో మాట్లాడారో లేదా తనే స్వయంగా తెలుసుకుంటానని ఈ క్రమంలో ప్రతి బుధవారం, గురువారం సంబంధిత ఫిర్యాదుదారులకు ఫోన్ చేసి మాట్లాడతానని కలెక్టర్ స్పష్టం చేశారు. కావున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, సమస్యల పరిష్కారంలో మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో భాగంగా వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పీజీఆర్ఎస్ లో వచ్చిన వినతులను వెనువెంటనే లాగిన్ లో ఓపెన్ చేసి చూడాలని, త్వరిగతిన పరిష్కరించాలని చెప్పారు. కాల పరిమితిలోగా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించాలని, కాల్ సెంటర్ ఫీడ్ బ్యాక్ లో పురోగతి ఇంకా మెరుగుపడాలని పేర్కొన్నారు. టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని, తల్లికి వందనం నిధుల జమలో తలెత్తిన సాంకేతిక సమస్యలను అధిగమించి లబ్దిదారులకు త్వరితగతిన ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం పీజీఆర్ఎస్ కు 348 వినతులుకలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 348 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 122, జీవీఎంసీకి చెందినవి 76, పోలీస్ శాఖకు సంబంధించినవి 14 ఉండగా వివిధ అంశాలకు, శాఖలకు చెందినవి మరొక 136 ఫిర్యాదులు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ తో పాటు, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్. భవానీ శంకర్, సీసీపీ ధనుంజయరావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు, వర్చ్యువల్ గా ఆయా మండల తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఇతర అధికారులు.



# అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

## లాగిన్ లో వచ్చిన అర్జీలను పెండింగ్ లో లేకుండా చూడాలి

## జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




కర్నూలు(విజయ సారథి):అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు.ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు..పిజిఆర్ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని, అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కర్నూలు అర్బన్ తహసిల్దార్ లాగిన్ లో 21 రోజుల నుండి 2 అర్జీలు, కల్లూరు తహసిల్దార్ లాగిన్ లో 3 అర్జీలు, సర్వ శిక్ష అభియాన్, పిఓ వద్ద 19 రోజుల నుండి 1 అర్జీ, దేవాదాయ శాఖ, డిప్యూటీ కమిషనర్ వద్ద 7 రోజుల నుండి 1 అర్జీ, ఉద్యానవన శాఖ వద్ద 7 రోజుల నుండి 1 అర్జీ, పంచాయతీ రాజ్ ఎస్ఈ వద్ద7 రోజుల నుండి ఒక అర్జీ చూడకుండా పెండింగ్ లో ఉన్నాయన్నారు.లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని, పెండింగ్ లో ఉండకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సిఎంఓ గ్రీవెన్స్ లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 10, పత్తికొండ ఆర్డీఓ వద్ద 6, కర్నూలు ఆర్డీఓ వద్ద 5, సర్వే ఏడి వద్ద 2, కార్మిక శాఖ, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్ లో ఉన్న వాటిని గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే అర్జీలు రీ ఓపెన్ లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, అనురాధ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదు

## రెవెన్యూ, రీసర్వే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించండి

## జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి




నంద్యాల(విజయ సారథి):ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదు. అర్జీల పరిష్కారంలో నాణ్యతను పెంచి అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల సమస్యల పరిష్కారంలో అధికారులు మెరుగైన దృష్టి సారించాలన్నారు. జిల్లాలో రెవెన్యూ, రీసర్వే అంశాలపై ఎక్కువ శాతం ఫిర్యాదులు రావడం జరుగుతుందని అందుకు ఆర్డీఓలు, తహశీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. ముఖ్యంగా ఆర్డీఓలు ప్రతి రోజూ తహశీల్దార్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎ వెళ్లకుండా పరిష్కరించేలా చూడాలన్నారు. రీఓపెన్, గడువులోపల అర్జీలపై నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుండి సమీక్ష చేయడం జరుగుతుంది కాబట్టి వాటి పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ప్రజా పరిష్కార వేదికకు వచ్చే విభిన్న ప్రతిభావంతుల కోసం 3 సహాయకులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.×పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని దరఖాస్తులు1. సర్వాయి పల్లె గ్రామ కాపరుస్తుడైన అయ్యన్న గారి శ్రీనివాసులు... గ్రామ పొలిమేరలో సర్వేనెంబర్ 165/2 లో 0.45 సెంట్ల భూమి ఇతరులకు ఆన్లైన్ చేసి ఉన్నారని పరిశీలించి తగు న్యాయం చేయగలరని కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.2. జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామం వాస్తవ్యులైన సుశీలమ్మ, శ్రీనివాసులు సర్వేనెంబర్ 883 లో 12.08 ఎకరాల పొలం ఇతరులు ఆక్రమించడానికి చూస్తున్నారని... పత్రాలను పరిశీలించి తగు పరిష్కారం చూపగలరని కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.3. డోన్ మండలం యాపదిన్నె గ్రామస్తులైన మనోహర్. సర్వే నంబర్ 420/ఎ నందలి 5.92 సెంట్ల విస్తీర్ణంగల తండ్రి నుంచి వారసత్వ భూమిని ఇతరులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పరిశీలించి తగు న్యాయం చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో 326 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. సదురు సమస్యలన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జీ సి సి ని పటిష్టపరిచే దిశగా ప్రభుత్వానికి సిఫారసు చేస్తాం

## ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డా. డి.వి.జి శంకర్రావు



విశాఖపట్నం(విజయ సారథి):సోమవారం విశాఖపట్నం జిల్లా పర్యటనలొ భాగంగా స్థానిక జి సి సి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.జి వి శంకర్రావు. తొలుత గిరిజన సంక్షేమానికై జిసిసి చేపడుతున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిఎం (అడ్మిన్) జి.సంధ్యారాణి వివరించారు. అనంతరం చైర్మన్ శంకర్రావు మాట్లాడుతూ జిసిసి ఉత్పత్తులు తయారీ మరియు మార్కెటింగ్ కోసం చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు, కార్యాలయ సిబ్బంది మరియు భవనాల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో అరకు కాఫీ కున్న ప్రాధాన్యతల దృష్ట్యా అమలు చేస్తున్న చర్యలు మరియు అభివృద్ధికై తీసుకోవలసిన జాగ్రత్తలపై సీనియర్ మేనేజర్ (కాఫీ) టీ.శ్రీనివాసరావుకు తగు సూచనలు చేశారు.జిసిసి ద్వారా చేపడుతున్న నూతన ప్రాజెక్టులు మరియు భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో ఉత్పత్తులు నిల్వ ఉంచుటకై కోల్డ్ స్టోరేజీలు, గోడౌన్ ల నిర్మాణాలకు మరియు సిబ్బంది నియామకానికై ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ ఎంవివిఎస్ ఉమాదేవి, జిఎం ఫైనాన్స్ నిర్మలమ్మ, జిఎం మార్కెటింగ్ త్రినాధరావు, డీజీఎం(డిఆర్ఎస్) సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వడ్లమూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం



.పెద్దాపురం(విజయ సారథి):కాకినాడ జిల్లా పెద్దాపురంమండలం వడ్లమూరు గ్రామపంచాయతీ కార్యాలయ ఎదురుగా సోమవారం సాయంత్రం పెద్దాపురంఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు . ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ దేవళ్ళ దుర్గా వరలక్ష్మి సతీష్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో గ్రామంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెట్టడం జరిగిందని అలాగే సిసి రోడ్లు, డ్రైనేజీలు, పెన్షన్లు, తల్లికి వందనం తదితరు కార్యక్రమంలో నిర్వహించడం జరిగిందని ఇంకా గ్రామంలో పెరిగిపోయిన సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చేస్తానన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడు పార్టీల సమిష్టిగా ప్రజలకు ఉపయోగించే పలు ప్రభుత్వ పథకాలు ప్రవేశపెట్టడం జరుగుతుందని అన్నారు. సందర్భంగా గ్రామంలో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com